ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 5 ఫిబ్రవరి 2024 | 5

నేడు స్పందన యథాతథం

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 4: జిల్లాలో సోమవారం యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. అలాగే డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, మునిసిపాలిటీల్లో కమిషనర్లు, మండల స్థాయిలో అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

ఓటుకు.. చేటు!



చనిపోయినా.. బతికించేశారు..

ఈ చిత్రంలో చూస్తున్నారుగా.. మొత్తం 13 ఓట్లు.. దేవరపల్లి మండలం పల్లంట్లకు చెందిన ఈ 13 మంది చాలా కాలం కిందట చనిపోయారు.. అయితే ఇటీవల విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో పేర్లు ఉండడం చూసి కుటుంబీకులే అవాక్కయ్యారు. అధికారులేం చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే మరి.

తప్పుల తడకగా ఓటర్ల తుది జాబితా


ఓటుందో లేదో చూస్కోండి బాబూ.. ఎందుకంటే చనిపోయిన వారిని బతికించేశారు.. బతికున్నవారిని చంపేశారు.. ఓటు తుది జాబితాలో సిత్రవిసిత్రాలు అన్నీ ఇన్నీ కావు.. తవ్వేకొద్దీ బయటపడుతూనే ఉన్నాయి.. రాజానగరం మండలం చక్రద్వారబంధంలో 33 మంది చనిపోయిన వారి ఓట్లు బయటపడడం మరువక ముందే.. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో చనిపోయిన వారి 20 ఓట్లు బయటపడ్డాయి.. దేవరపల్లిలో చూస్తే 13 మృతుల ఓట్లు ఉండడం గమనార్హం.. ఆ నోటా ఈ నోటా సంగతి తెలియడంతో ఓటుందో లేదో తెలుసుకునేందుకు జనం పరుగులు పెడుతున్నారు..

పెరవలి, ఫిబ్రవరి 4 : ఓటర్ల తుది జాబితాలు తప్పుల తడకగా తయారయ్యాయి.. ఏ జాబితా చూసినా ఏదో ఒక చోట తప్పులు కనిపిస్తూనే ఉన్నాయి.. జాబితాలో చనిపోయిన వారు నేటికీ బతికే ఉన్నారు. ఇలా ఒక్కో జాబితాలో 20 నుంచి 30 వరకూ ఓట్లు కనిపిస్తుండడం గమనార్హం. డబుల్ ఎంట్రీలు.. ఫొటోలు లేకుండా ఇలా రకరకాలుగా ఉన్నాయి. దీనిపై ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత మంది అధికార యంత్రాంగం ఉండి ఏం లాభం అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు 1569 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఓటర్ల జాబితా సవరణ అనంతరం కొత్తగా విడుదల చేసిన జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అన్ని గ్రామాల్లోనూ చనిపోయిన వారి పేర్లు తొలగించలేదని.. ఒకే వ్యక్తికి రెండు, మూడు ఓట్లు ఉన్నా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల ఫొటోలు లేవు.. మరికొన్ని చోట్ల పేర్లు సక్రమంగా లేవు.. ఒక వార్డులోని పేర్లు వేరొక చోటకు మార్చడం తదితర కారణాలతో ఓటుపై అయోమయం నెలకొంది. తీపర్రులో నల్ల సూర్యారావు మృతిచెందినప్పటికి ఆయన ఓటును జాబితా నుంచి తొలగించలేదు.. ఇదేవిధంగా సుమారు పది మంది పేర్లు తొలగించలేదని సమాచారం. కానూరు అగ్రహారంలో సుమారు 20 మంది చనిపోయిన వారి పేర్లు ఉన్నట్టు సమాచారం. 17 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నాయి.. ఫొటోలు లేకుండా మరో 15 మంది ఉన్నారు. ఒక వార్డు నుంచి వేరొక వార్డుకు మార్చవలసినవిగా, ఒక బూత్‌నుంచి వేరొక బూత్‌కు మార్చవలసినవి ఎక్కువగా ఉన్నాయి. నడిపల్లిలో కూడా సుమారు 20 మంది మృతుల ఓట్లు తొలగించలేదు. డబుల్ ఎంట్రీ ఉన్నవి ఐదు ఉన్నాయి. మండలంలోని గ్రామాల్లో జాబితాలు తప్పులతడకగా ఉన్నాయని ఆరోపించారు.

- చనిపోయినా.. ఓటిచ్చారు
- ఓటరు జాబితాల్లో మృతుల పేర్లు
- అవాక్కవుతున్న కుటుంబీకులు
- గ్రామగ్రామాన జాబితాల్లో తప్పులే
- పెరవలి, దేవరపల్లి మండలాల్లో ఇలా
- చక్రద్వారబంధంలో 33 మంది పేర్లు
- తుది జాబితాపై అయోమయం


దేవరపల్లిలో 13 మంది..

దేవరపల్లి, ఫిబ్రవరి 4 : ఓటర్ల జాబితాలో క్షేత్రస్థాయిలో ఇంటింటికి సర్వే చేసి పరిశీలన తరువాత తుది జాబితా విడుదల చేసినట్టు ప్రభుత్వ యంత్రాంగం చెప్పినప్పటికీ అన్ని గ్రామాల్లోనూ ఓటరు జాబితాల్లో లోపాలు కనిపించడం విశేషం. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామసచివాలయం 111, 112 పోలింగ్ బూత్‌ల పరిధిలో 2 వేల మంది ఓటర్లు ఉండగా ఓటర్ జాబితాను పరిశీలించగా 13 మంది మృతి చెందినవారి ఓట్లు ఉండడం గమనార్హం. ఎస్తేరు ఈదూరి, కృష్ణయ్య కొయ్యా, ఏసురత్నం పెదపాటి, ఆశీర్వాదం ఐనపర్తి, గెల్లా అనూష, సత్తియ్య మెరిపో, గొయ్యమ్మ రాయుడు, కృష్ణారావు నూతలపాటి, కృపమ్మ రాయుడు, రాజారావు నిట్టా, సత్తెమ్మ అక్కాబత్తుల, దానమ్మ రాయుడు పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయి. డబుల్ ఎంట్రీలో దుర్గా పొన్నాడ, పృధ్వీరాజు చాపల పేర్లు ఉన్నాయి. 3 నుంచి ఆరేళ్ల కిందట చనిపోయిన మృతుల ఓట్లు తొలగించకుండా యథాతథంగా ఓటర్ల లిస్టులో ఉండడం గమనార్హం. వీఆర్వోలు, ఓటర్ లిస్టులో డబుల్ ఎంట్రీలు రాకుండా, మృతి చెందిన వారి పేర్లు తొలగించకుండా తుది జాబితా విడుదల చేయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. యర్నగూడెంలో మృతిచెందిన ఓటర్ల డబుల్ ఎంట్రీలు ఉండడంతో యర్నగూడెం గ్రామానికి చెందిన బీఎల్‌వో కే.శశిప్రియాంకను జిల్లా కలెక్టర్ మాధవీలత సస్పెండ్ చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఓటర్ల జాబితాలో ఉంది. దీనిపై అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.



ఇలాగైతే.. ఓటెలా!

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఓటు చూశారా.. ఇది తీపర్రుకు చెందిన నల్ల సూర్యారావు ఓటు... ఆయన చనిపోయి చాలా కాలమైంది.. అయితే ఇటీవల విడుదల చేసిన ఓటరు తుది జాబితాలో ప్రత్యక్షమైంది.. కుటుంబీకులు ఈ ఓటు ఎలా వచ్చింది చెప్మా అంటూ అవాక్కయ్యారు.. ఈ కింద యువతి ఓటు చూశారా.. ఫొటో ఉంది.. పేరు మాయమైంది.. ఆ యువతి ఓటు ఎలా వేయాలి.. ఓటరు జాబితాల్లో ఇలా ఎన్నో సిత్ర విసిత్రాలు తారసపడుతున్నాయి..



అమ్మో పులి



గత రెండు వారాలుగా పులి భయపెడుతూనే ఉంది.. ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని అడవిని సరిహద్దుగా చేసుకుని తిరుగుతూనే ఉంది.. జనం ఏ క్షణం ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతూనే ఉన్నారు.. అయినా అటవీ సిబ్బందిలో మాత్రం కదలిక లేదు.. పులిని పట్టుకుందామన్న చొరవ కనిపించడంలేదు.. శుక్రవారం రాత్రి కరగపాడు వద్ద రిజర్వు ఫారెస్టులో ట్రాపింగ్ కెమెరాకు చిక్కిన పులి.. ఆదివారం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురం వద్ద ఆవుపై దాడి చేసి చంపేసింది.. దీంతో ఏజెన్సీ వాసులు భయపడుతున్నారు. పులిని పట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.. - వివరాలు 7లో



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఎస్ జవహర్

హక్కుల కోసం పోరాడాలి

ఏపీటీఎఫ్ జిల్లా సమావేశంలో నాయకుల పిలుపు

కొవ్వూరు, ఫిబ్రవరి 4 : ఉద్యోగ, ఉపాధ్యాయులు హక్కులు, సౌకర్యాల సంరక్షణకు నేడు పోరాటం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.ఎ. సాల్మన్‌రాజు పిలుపునిచ్చారు.కొవ్వూరు హోలి ఏంజిల్స్ పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు వెట్టిచాకిరికి గురిచేసే విధానాన్ని పోరాడి రద్దు చేయించుకున్నారని, నేడు గౌరవ వేతనం పేరుతో తిరిగి ప్రవేశపెట్టాలనే ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మేలు చేకూర్చేలా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలన్నారు. 12వ పీఆర్‌సీని అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రి, ఏపీటీఎఫ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు కె.ఎస్.జవహర్ మాట్లాడుతూ 117 జీవోను తక్షణం రద్దు చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 117 జీవోను రద్దు చేస్తామన్నారు. ఎన్నికల ముందు విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని, వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని అన్న నాయకులు ఏమి చేశారో గమనించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, జీపీఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దున్నా దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా పి.సువర్ణరాజు, ఉపాధ్యక్షులుగా పి.గంగరాజు, ఎం. వెంకటరావు, ఎ.పద్మలత, ఐ.సూర్యనారాయణ, కార్యదర్శులుగా ఎస్.రాజశేఖర్, కె.వి.రాఘవులు, వి.అనితాజ్యోతి, పీవీకృష్ణమోహన్, బి.రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సలీంలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో సాల్మన్‌రాజు ప్రమాణ స్వీకారం చేయించారు.

టెన్త్ ఫలితాలు మెరుగుపడాలి

జిల్లా బీసీ సంక్షేమాధికారి సత్యరమేష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4 : జిల్లాలోని బీసీ హాస్టళ్లలో 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులు మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి పి.సత్యరమేష్ అన్నారు. రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్‌లో టెన్త్ విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన శిక్షణ, ప్రేరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హాస్టల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయుల శిక్షణకు సహకరించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ ఏబీసీడబ్ల్యూవో పి.రామకృష్ణ, హెచ్‌డబ్ల్యూవోలు ముత్యాల సుబ్బారావు, ఆర్.చిరంజీవి, పి.సరోజ, కేజీ కాత్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సర్పంచ్‌ల చలో అసెంబ్లీ

కొవ్వూరు, ఫిబ్రవరి 4 : సర్పంచ్‌ల సమస్యలపై ఈ నెల 6వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు పాలడుగుల లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14,15 ఆర్థిక సంఘం నిధులు రూ.8629 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించి, దారి మళ్లించిందన్నారు. ఆయా నిధులను గ్రామ సర్పంచ్‌ల ఖాతాల్లో జమచేయాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్పంచ్‌ల ఆధీనంలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ నిధులు చట్ట ప్రకారం పంచాయతీలకు ఇచ్చి సర్పంచ్‌ల చేత ఖర్చు చేయించాలన్నారు. పంచాయతీలకు ఉచిత విద్యుత్ అందించాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రూ.15 వేలు చొప్పున, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ. 30 వేలు వంతున గౌరవ వేతనం అందజేయాలన్నారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సర్పంచ్‌లు, రాజకీయాలకతీతంగా ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు అమరావతిలోని అసెంబ్లీ వద్దకు చేరుకుని చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



కోటసత్తెమ్మ.. కరుణించమ్మా

నిడదవోలు, ఫిబ్రవరి 4 : కోటసత్తెమ్మ కరుణించమ్మా అంటూ భక్తులు పెద్ద ఎత్తున నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు.ఆదివారం ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవతో ప్రారంభమై ధూప హారతి, నిత్యార్చన, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు.ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.2,02,229లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.



సీట్లు.. సిగపట్లు!

తూర్పున రాజకీయ కాక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలు ఇక కూతవేటు దూరంలో ఉన్నాయి. ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. తర్వాత నోటిఫికేషన్ వస్తుంది. ఇక ఎన్నికలు జరగడానికి ఎన్నో రోజులు లేవు. మండుటెండల్లో ఎన్నికలు జరగనున్నాయి. కానీ ఇప్పటి నుంచే జిల్లాలో పొలిటికల్ హీట్ మొదలైంది.టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం అమరావతిలో భేటీ అయిన సంగతి తెలిసిందే.రెండు పార్టీల నుంచి ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేయాలి.ఏ పార్టీ ఎన్నిచోట్ల పోటీ చేయాలనే విషయంలో ఇద్దరు పెద్దలు ఒక అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో త్వరలోనే తెలుగుదేశం, జనసేన అభ్యర్థుల జాబితా అధికారికంగా రానుంది. దీంతో టీడీపీ- జనసేనలో చేరికలు పెరుగుతున్నాయి. అనేక వర్గాలు ముందుకు వచ్చి చేరుతున్నారు.ఆయా చోట్ల టికెట్లు ఆశించేవారు ఆయా వర్గాలను ఆకట్టుకునే పనిలో ఉన్నారు.ఇక టికెట్ల విషయంలో ఇప్పటికే జిల్లాలో కొందరు అభ్యర్థులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. రాజమహేంద్రవరం సిటీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే భర్త, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్‌కార్యదర్శి ఆదిరెడ్డి వాసుకు, అనపర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి,గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మిగతా చోట్ల అధికారికంగా ప్రకటించే వరకూ కొంత సందిగ్ధత కొనసాగనుంది. ఇక రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని స్వయంగా పవన్‌కల్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్కడ అభ్యర్థి పేరు ప్రకటించకపోయినా నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఇప్పటికే మీటింగ్‌లు పెట్టి, తానే అభ్యర్థినని పబ్లిక్‌గా చెబుతున్నారు. నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటున్నారు. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ కూడా ఈ సీటు తనకే హామీ ఇచ్చారని,కొద్దిరోజుల్లో గందరగోళానికి తెరపడుతుందని ఆయన అంటున్నారు. రాజమహేంద్రవరం రూరల్ నుంచి ఎమ్మెల్యే టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తాను తిరిగి రాజమహేంద్రవరం రూరల్ నుంచే పోటీ చేస్తానని ఖరాఖండీగా చెబుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ తిరిగి టికెట్లు ఇస్తామని గతంలోనే ప్రకటించడంతో ఆయన నియోజకవర్గంలో పార్టీ పనిలో నిమగ్నమయ్యారు.పైగా ఇటీవల ఆయన నియోజకవర్గం పరిధిలోని కాతేరులో నిర్వహించిన రా కదలిరా బహి రంగ సభ ఊహించిన దానికంటే విజయవంతం కావ డంతో ఆయన మరింత హుషారుగా ఉన్నారు.కానీ ఇదే స్థానం నుంచి జనసేన కీలకనేత, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ పోటీ చేస్తానని..ఇప్పటికే తనకు అధిష్ఠానం చెప్పిందని ప్రచారం చేసుకోవడం గమనార్హం. తెలుగు దేశం- జనసేన అధిష్ఠానాలు స్పష్టత ఇవ్వవలసి ఉంది. నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు,మరో సీనియర్ నేత కుందుల సత్యనారాయణ సీటు కోసం పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. కొవ్వూరులో మాజీ మంత్రి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కెఎస్ జవహర్ అభ్యర్థిత్వాన్ని అక్కడ ఓ ప్రధాన వర్గం వ్యతిరేకిస్తుంది. ఇటీవల ఆత్మీయ సమావేశం పేరిట, జవహర్ వ్యతిరేకవర్గం సమావేశమైన సంగతి తెలిసిందే. జవహర్ తప్ప ఇంకెవరికి ఇచ్చినా ఫర్వాలేదనేది వారి వాదన.అందులో గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడివెంకటేశ్వరరావును కూడా ప్రతిపాది స్తున్నట్టు సమాచారం.కానీ అధిష్ఠానం కెఎస్ జవహర్‌ను అంత తేలికగా తీసి పడేయదనే వాదన కూడా ఉంది. జవహర్‌కు ప్రజల్లో పట్టు ఉన్నా, అక్కడ కీలక పెద్దలతో విబేధాలే ఆయనకు సమస్యగా మారాయి.ఇక్కడ జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు టికెట్ ఆశిస్తు న్నారు. టీడీపీలో గిల్లికజ్జాల మధ్య తనకే అవకాశం వస్తుందనే ఆశతో ఆయన ఉన్నారు.

వైసీపీలో ఎవరి దారి వారిదే..

వైసీపీలో గందరగోళం పోలేదు. కొన్ని సీట్లు ఖరారైనా వారిలో పెద్దగా ఉత్సాహం కనిపించడంలేదు. ఇంత వరకూ నలుగురు అభ్యర్థులను వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది.కానీ నలుగురిని ఓ స్థానం నుంచి మరో స్థానా నికి బదిలీ చేసింది. దీంతో వారికి అక్కడ అనేక సమ స్యలు ఎదురవుతున్నాయి.జిల్లా మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురం పంపించారు. అక్కడి ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు పంపించారు. గోపాలపురంలో ఇప్పటి వరకూ ఎమ్మెల్యే కూడా ఉన్న వర్గానికి మంత్రి వనిత ప్రాధాన్యత ఇవ్వరని, ఆమె ఇతరులకు ప్రాధాన్యత ఇస్తుందనే వాదన పెరిగింది. అదే పరిస్థితి కొవ్వూరులో కూడా ఉంది. కొవ్వూరులో ఆమె అక్కడి పెద్దలను కాదని ఓ ప్రత్యేక వర్గాన్ని పెంచి పోషించినట్టు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే.ఇవాళ తలారి వెంకట్రావు ఆమెను వ్యతిరేకించిన వర్గంతో ముందుకు వెళుతున్నారు. దీంతో కొవ్వూరులోని ఆమె వర్గంగా చలామణీ అయిన నేతలంతా దిక్కులు చూస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవిలో ఉన్న చెల్లుబోయిన వేణును రాజమహేంద్రవరం రూరల్‌కు పంపించడంతో కొందరు అసంతృప్తితో ఉన్నారు. స్థానిక బీసీ నేతలకు ఎవరికైనా చోటు కల్పిస్తే బావుండేదనే వాదన ఉంది. అక్కడ ఇంత వరకూ కోఆర్డినేటర్‌గా ఉన్న చందన నాగేశ్వర్ ఎటూకాకుండా పోయారు. ఆయన తండ్రి చందన రమేష్ గతంలో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన సంగతి తెలిసిందే. మంత్రికి ఇక్కడ సీటివ్వడంతో చందన బయట తిరగడం మానేశారు. ఎంపీ మార్గాని భరత్‌కు కూడా తలపోట్లు తప్పడంలేదు. ఎంపీ స్థానం నుంచి ఆయనను సిటీ ఇన్‌చార్జిగా నియమించిన సంగతి తెలిసిందే.కానీ సిటీలో ఆయనకు వైసీపీలో ముఖ్య నేతలు చాలా మంది వ్యతిరేకులే. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు.ఆయన ఆధ్వర్యంలో ఇటీవల ఆర్యవైశ్యుల సమావేశం జరిగింది. వైశ్యులకు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన శ్రేయోభిలాషులు, అనుచరులు మాత్రం వేరే పార్టీలోకి వెళ్లాలని ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డికి ఎంపీ భరత్ మధ్య కూడా గ్యాప్ ఉంది.ఇది ఏ పరిస్థితులకు దారితీస్తుందో మరి.ఇక జిల్లాలో ఇంకా ముగ్గురు ఎమ్మెల్యేలను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.రాజానగరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా టికెట్ తనకేనని చెబుతూ, పార్టీ ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఆయన సోదరుడు గణేశ్ తనకూ ప్రాధాన్యత కావాలని పట్టుపడుతున్నట్టు సమాచారం.అనపర్తి ఎమ్మెల్యే డా. సూర్యనారాయణరెడ్డి పేరు కూడా అధికారికంగా ఖరారు కావలసి ఉంది.ఆయన సతీమణి కూడా రాజకీయాలు కీలకంగా ఉంటుండడంతో జగన్ ఏవిధంగా ఇక్కడ నిర్ణయం తీసుకుంటారోననే మీమాంస ఉంది. ఇటీవల ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తన కుటుంబ పెద్దలు, సభ్యులతో అంతర్గత సమావేశం పెట్టి,రాష్ట్రంలో టీడీపీ- జనసేనే అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, ఇక్కడ మాత్రం మనమే గెలుస్తామనే అభిప్రాయానికి వచ్చి, ఎన్నికల తర్వాత ఏ నిర్ణయం తీసుకుంటే బావుంటుందనే కోణంలో చర్చ జరిగినట్టు విస్తృతంగా ప్రచారం జరిగింది.నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు విషయంలో కూడా అధికారికంగా ప్రకటించవలసి ఉంది.

- ఎన్నికలకు సిద్ధమైన నాయకులు
- ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూల్
- సీట్ల ఖరారులో అధినేతలు
- ఆచితూచి అడుగులు
- త్వరలోనే టీడీపీ-జనసేన ప్రకటన
- 4 స్థానాలకు ప్రకటించిన వైసీపీ
- మూడు స్థానాలపై అటెన్షన్
- ఎంపీ అభ్యర్థిగా గూడూరి
- బదిలీలపై సిట్టింగ్‌ల అసహనం
- బరిలో బీజేపీ, వామపక్షాలు

టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎవరో?

జిల్లాలో ఇపుడు టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎవరనే చర్చ జరుగుతోంది. వైసీపీ ఇప్పటికే డా. గూడూరి శ్రీనివాసరావును రాజమహేంద్రవరం లోక్‌సభ ఇన్‌చార్జిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. టీడీపీ అభ్యర్థి కూడా త్వరలో ఖరారు కానున్నారు.టీడీపీ- జనసేన శాసన సభ అభ్యర్థుల ప్రకటన తర్వాతే ఎంపీ అభ్యర్థిని ప్రకటిస్తారనే ప్రచారం ఉంది. మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, బొడ్డు వెంకటరమణ, గన్ని కృష్ణ, శిష్టాలోహిత్ వంటి పేర్లు పరిశీలనలో ఉన్నట్టు చెప్పారు.ఇక బీజేపీ, వామపక్షాలు కూడా ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి.




పుష్కరప్లాజా వద్ద పైకిలేచిన టైల్స్‌ను పరిశీలిస్తున్న ఆదిరెడ్డి వాసు

నాణ్యత లేకుండా పనులు

కమీషన్లకు ఎంపీ అనుచరుల కక్కుర్తి : ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్ రామ్ అనుచరుల కమీషన్ల కక్కుర్తి వల్ల అభివృద్ధి పనుల్లో డొల్లతనం కనిపిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు. రాజమహేంద్రవరం పుష్కరప్లాజాను ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ పైకి లేచి ప్రమాదకరంగా ఉన్న టైల్స్‌ను చేశారు. పుష్కరప్లాజా ఏర్పాటులో నాణ్యత ప్రమాణాలు లోపించాయని ఆరోపించారు. ప్రజాధనంతో చేపట్టిన చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండడం వల్ల నేటికీ చెక్కుచెదరలేన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి ఎంపీ అనుచరులు నాణ్యత తోపాలతో పనులు చేసినా భరత్ రామ్ ఒత్తిడి వల్ల వారిపై కమిషనర్ ఎటువంటి చర్యలు తీసుకోలేన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, టీడీపీ కోశాధికారి శెట్టి జగదీష్, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు తవ్వా రాజా, నాయకులు మాటూరి సిద్దు, ఎంఎస్.రావు, నల్లం ఆనంద్, గ్రంధి రాజా,కొత్త రాజేష్, సిహెచ్ శివ, పింకేష్, నారాయణ పాల్గొన్నారు.



చాగల్లులో స్థల పరిశీలన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

9న కొవ్వూరులో షర్మిల రచ్చబండ

చాగల్లు, ఫిబ్రవరి 4 పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 9వ తేదీన కొవ్వూరు నియోజవర్గంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారని కాంగ్రెస్ పార్టీ ఉభయగోదావరి జిల్లాల పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలో స్థల పరిశీలన చేస్తున్నట్టు చెప్పారు. ఆదివారం చాగల్లు విచ్చేసి పర్యటనకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా స్థలం ఎంపిక చేస్తామని కాంగ్రెస్ పార్టీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నం మురళీకృష్ణ, కే.శ్రీనివాస్, పాలకుర్తి ప్రభాకర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా జడ్పీ మీటింగ్


మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్


సమావేశానికి హాజరైన జడ్పీటీసీ సభ్యులు

అంతా మొక్కుబడే!
అజెండా అంశాలపై చర్చ లేకుండా మమ..
ఉమ్మడి జడ్పీ సమావేశం జరిగిన తీరు ఇది..
ఎమ్మెల్యేలు రాక నామమాత్రంగానే..

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: అంతా మొక్కుబడే.. అజెండా అంశాలపై చర్చ లేకుండానే మమ అనిపించారు.. ఎమ్మెల్యేలు రాకపోవడంతో సాదాసీదాగా జరిగిన చర్చ.. మొత్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జడ్పీ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. రానున్న వేసవిలో సాగునీటి, తాగునీటి ఎద్దడిపై కొందరు జడ్పీటీసీలు చర్చించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కాకినాడ ఎంపీ వంగా గీత, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా అతిథులుగా విచ్చేశారు.

రెండున్నరేళ్లు పూర్తి

మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రానున్న వేసవిలో సాగు, తాగునీటికి రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠమైన ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులను కోరారు. వేసవిలో తాగునీటి కార్యాచరణపై ఎంపీ గీత, రాజ్యసభ సభ్యుడు బోస్ మాట్లాడారు. జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లా ప్రగతి సాధన అంశాల్లో తమ వంతు కృషి చేస్తూ జడ్పీ పాలక మండలి రెండున్నరేళ్ల కాలం విజయవంతంగా పూర్తి చేసుకుందన్నారు. ఇందుకు అన్ని విధాలా కృషి చేసిన సభ్యులు, సహకరించిన అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

2024-25 అంచనా బడ్జెట్ ఆమోదం

అనంతరం 2023-24 సంవత్సరానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సవరణ బడ్జెట్, 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను చర్చ, ఆమోదం కోసం సభ ముందు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మేరకు వివిధ పద్దుల కింద రూ.883.34 కోట్ల ఆదాయం, రూ.882.79కోట్ల వ్యయం అంచనాలుగా రూ.55లక్షల మిగులుతో ప్రస్తుత 2023-24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ ప్రతిపాదనలను, రూ.886.95కోట్ల ఆదాయం, రూ.886.33కోట్ల వ్యయం అంచనాలతో రానున్న 2024-25 సంవత్సరానికి రూ.62 లక్షల మిగులుతో అంచనా బడ్జెట్ ప్రతిపాదనలను జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి పద్దుల వారీగా చదివి వినిపించారు.

వివిధ అంశాలపై సమీక్ష

అజెండాలోని వివిధ అంశాలపై సభ్యులు సమీక్షించారు. రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టిన ముందస్తు కార్యాచరణ గురించి సభ్యులు అడగ్గా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరిస్తూ మూడు జిల్లాల పరిధిలో అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో నింపగలమని తెలిపారు. తాగునీటి ఎద్దడి ఎదురయ్యే ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని వివరించారు. రబీ పంటలకు అవసరమైన విత్తనాలకు కొరత లేదని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో అమలవుతున్న పనులను ఆ శాఖ అధికారులు తెలియజేశారు. సమావేశంలో సభ్యులు సూచించిన అంశాలపై తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.


ఎంపీలు వంగా గీత, బోస్

ఉన్నత పదవులకు జడ్పీ వేదిక

రాజకీయాల్లో ఉన్నత పదవులు అధిరోహించేందుకు జడ్పీ వేదిక అని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. తాను, ఎంపీ గీతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ వేదికగా ప్రజాసేవలోకి వచ్చామన్నారు. తమలాగే ప్రస్తుత పాలకమండలిలోని సభ్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న పథకాల లబ్ధి అందరికీ అందేలా కృషి చేయాలని సభ్యులను కోరారు. రాబోయే ఎన్నికల్లో ఈ వేదిక మీద తాను, ఎంపీ, జడ్పీ చైర్మన్ కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పోటీ చేయనున్నామన్నారు. సమావేశంలో కాకినాడ జిల్లా జేసీ ప్రవీణ్ ఆదిత్య, కోనసీమ జిల్లా జేసీ నూపూర్ అజయ్, తూర్పుగోదావరి జిల్లా జేసీ తేజ్‌భరత్, జడ్పీ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఊపిరి పీల్చుకున్న జనం

కన్నాపురం రిజర్వ్ ఫారెస్ట్‌లోకి పులి ప్రవేశం

గోపాలపురం, ఫిబ్రవరి 4: కొన్ని రోజులుగా పెద్దపులి సంచారంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతూ, కంటి మీద కునుకు లేకుండా ఉన్న గోపాలపురం మండల ప్రజలు పెద్దపులి కన్నాపురం రిజర్వ్ ఫారెస్టుకు ప్రవేశించిందన్న వార్తతో ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున కరగపాడు అటవీ ప్రాంతాన్ని దాటి బుట్టాయిగూడెం మండలం లక్ష్మీపురం వద్ద ఒక ఆవుపై దాడి చేసి చంపిన పెద్దపులి అనంతరం కన్నాపురం అటవీ ప్రాంతంలోకి ప్రవేశించినట్టు అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం


వివరాలు చెబుతున్న పోలీసులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైలులో చట్ట విరుద్ధంగా తీసుకొస్తున్న తెలంగాణ మద్యం సీసాలను ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. సీఐ విజయ్‌శంకర్ వివరాల ప్రకారం.. ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో భాగంగా జీఆర్పీ డీఎస్పీ ఎల్.మోహన్‌రావు పర్యవేక్షణలో రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆర్‌పీఎస్ఐ కె.మావుళ్లు తమ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం, బంగారం, నగదు అక్రమ రవాణాపై దృష్టి సారించారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి రైలులో రాజమహేంద్రవరం వచ్చిన రావులపాలెం మండలం వెదిరేశ్వరానికి చెందిన వాసంశెట్టి ధనరాజ్ లగేజీ బ్యాగ్‌ని తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి తీసుకొస్తున్న 6 మద్యం ఫుల్ బాటిళ్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని ధనరాజ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అన్నవరం దేవస్థానంలో అంతర్గత బదిలీలు

ఫైల్ సిద్ధం చేసిన అధికారులు

అన్నవరం, ఫిబ్రవరి 4: అన్నవరం దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఇతర క్యాడర్‌లలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి అంతర్గత బదిలీలు చేపట్టేందుకు పరిపాలన విభాగ అధికారులు దస్త్రాలను సిద్ధం చేశారు. ప్రతి విభాగ ఉద్యోగిని మూడు నెలలకు ఒకసారి అంతర్గత బదిలీ చేయాలనే కమిషనర్ ఉత్తర్వులు మేరకు ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. ఇప్పటికే ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు అంతర్గత బదిలీలు పూర్తికాగా మిగిలిన సిబ్బందిని ఒకట్రెండురోజుల్లో బదిలీ చేయనున్నారు. సోమవారం ఈ దస్త్రంపై ఈవో రామచంద్రమోహన్ సంతకం చేయనున్నట్లు ప్రచారం జరుగుతుంది.

నేడు శంఖు, చక్ర, నామాలు ప్రారంభం

అన్నవరం దేవస్థానంలో సుమారు 70 లక్షలతో ప్రకాష్‌సదన్ కాటేజీపై ఏర్పాటుచేసిన శంఖు, చక్ర, నామాలను సోమవారం ప్రారంభించనున్నట్లు దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం ట్రయిల్ రన్ నిర్వహించినట్లు చెప్పారు. 42 అడుగులు పొడవు, 90 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేశామన్నారు. ఈ శంఖు, చక్ర, నామాల వెలుగు సముద్రతీర ప్రాంతానికి కనిపిస్తుందని, జాతీయ రహదారిపై, రైలులో ప్రయాణించే ప్రయాణికులకు రాత్రి సమయంలో అన్నవరం చేరుకున్నామనే భావన కలుగుతుందన్నారు.

ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమస్యలపై ప్రత్యేక దృష్టి

యూపీఈఐఎఫ్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ శ్రీవిజయ్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 4: పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ అన్నారు. ఈ మేరకు పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం కాకినాడలో యూపీఈఐఎఫ్ కార్యనిర్వాహక సభ్యులను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ లీగల్ అడ్వైజర్ శ్రీవిజయ్ మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతామని, సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తామని ప్రకటించారు. దీంతో ఫెడరేషన్ లీగల్ అడ్వైజర్, కార్యనిర్వాహక సభ్యులకు పోలవరం ముంపు మండలాల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు రిఫరీలుగా ఎంపిక

రామచంద్రపురం, ఫిబ్రవరి 4: ఈ నెల 7 నుంచి 11 వరకు న్యూఢిల్లీలో గల జాదవ్ ఇండోర్ స్టేడియంలో అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంటర్నేషనల్ రిఫరీలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎన్.గిరివెంకటరమణ, బి.కె.రత్నం, వై.అంజనీకుమార్ ఎంపికైనట్లు కోనసీమ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి తెలిపారు. వారిని వైజాగ్ కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు ఆనందబాబు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అభినందించారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


సహపంక్తి భోజనాలు

లోవలో భక్తుల కోలాహలం

తలుపులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



తుని రూరల్, ఫిబ్రవరి 4: తూర్పు కనుమల్లో కొలువై భక్తుల ఆరాధ్య దైవ్యంగా పూజలు అందుకుంటున్న తలుపులమ్మ అమ్మవారి క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తల్లి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్‌లు కిక్కిరిసాయి. అమ్మవారిని భక్తులు దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు దేవస్థానం సమకూర్చిన వంట షెడ్‌లతో పాటు ఆలయ వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ ఈవో విశ్వనాథరాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు చేశారు. ఆదివారం ఒక్క రోజే లోవకు తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా రూ.4.66 లక్షలు ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం



రంపచోడవరం, ఫిబ్రవరి 4: భూపతిపాలెం రిజర్వాయర్‌లో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఆత్మహత్యకు పాల్పడిందా లేక ఎవరైన హత్య చేసి రిజర్వాయర్‌లో పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నెంబర్లు 9440900762, 9381483283కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

తక్కువ పోస్టులతో ఉద్యోగ ప్రకటనలా?

ఇది నిరుద్యోగులను మోసగించడమే
ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు


పోటీ పరీక్షల పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4: వైసీపీ ప్రభుత్వం తన పదవీకాలం చివరిలో అతితక్కువ పోస్టులతో ఉద్యోగ ప్రకటనలు చేయడం నిరుద్యోగులను మోసం చేయడమే అని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) అన్నారు. ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో డీఎస్సీ, గ్రూప్స్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు నిరాశ మిగిల్చిందని విమర్శించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో గ్రూప్స్, డీవైఈవో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, వీరేశలింగం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఐవీ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఏటా జనవరిలో జాబ్ కేలండర్ ఇస్తామని, ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను వంచించిందన్నారు. అభ్యర్థుల వయో పరిమితి పెంచడానికి చర్యలు తీసుకోవాలని, గ్రూప్స్, డీఎస్సీలో మరిన్ని పోస్టులు పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పోటీ పరీక్షలపై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తూ పోటీ పరీక్షలకు, అకడమిక్ పరీక్షలకు మధ్య ఉన్న తేడాను గమనించాలని సూచించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు రచించిన భారత సమాజం అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ ఐవీ, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే పుస్తకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి ఆవిష్కరించారు. సదస్సులో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, నాయకులు పాల్గొన్నారు.

పంట సాగు కోసం అప్పుల పాలై..

● భార్యాభర్తల మధ్య గొడవ ● పురుగుల మందు తాగి భర్త మృతి



ఎటపాక, ఫిబ్రవరి 4: పంటల సాగు కోసం చేసిన అప్పుల విషయంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగి... చివరకు క్షణికావేశంలో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి ఎటపాక మండలం, రాంగోపాలపురం పంచాయతీ నర్సింగ్‌పేట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొంది కామేశ్వరరావు(39) గత నాలుగేళ్లుగా అప్పులు చేస్తూ వ్యవసాయం చేస్తున్నాడు. గత నాలుగేళ్ల నుంచి పంటల్లో నష్టం రావడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఈఏడాది మరలా అప్పులు చేసి, మిర్చి, పత్తి, వరి సాగు చేశాడు. అయితే ఈసారి కూడా తెగుళ్లు, తుఫాన్ ప్రభావంతో పంట నష్టం వాటిల్లింది. దాంతో శనివారం రాత్రి భార్యాభర్తల మధ్య అప్పుల విషయంలో వివాదం జరిగింది. దాంతో కామేశ్వరరావు కొద్దిసేపటికి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాధ, కూతురు నందిత్య, కొడుకు సాద్విక్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు వద్ద నున్న శ్రీ గౌతమీ వ్యాయామ కళాశాల ఆవరణలో 15వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు ఆదివారం రాత్రి నిర్వహించారు. జాంపేట కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్ ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె మధు, బిగ్ వింగ్ ఎండీ బులి వెంకటరావు, ప్రవీణ్ నాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిస్టర్ ఇండియా రామాంజనేయులును సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది బాడీ బిల్డర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలైన వారు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో నిర్వహించే సౌత్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీలకు, మార్చి 15, 16, 17 తేదీల్లో తిరుచూర్‌లో జరిగే ఆలిండియా పోటీలకు ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా వెళతారని పేర్కొన్నారు.

బెండమూర్లంకలో 'శశివదనే' షూటింగ్



అల్లవరం, ఫిబ్రవరి 4: గౌరీనాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి నిర్మాణ సారథ్యంలో ఉబ్బన సాయిమోహన్ దర్శకత్వంలో 'శశివదనే' సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణతో బెండమూర్లంకలో షూటింగ్ సందడి నెలకొంది. పలాస ఫేమ్ రక్షిత్ హీరోగా, కోమలి ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తుండగా వారిపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో రక్షిత్, తమిళ నటుడు శ్రీమాన్, సుబ్రహ్మణ్యం, నాయుడులపైనా కొన్ని దృశ్యాలు తీశారు. కెమెరామెన్‌గా శ్రీసాయికుమార్ దారా, మ్యూజిక్ డైరెక్టర్‌గా చరణ వాసుదేవాన్ వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా త్వరలోనే విడుదలవుతుందని నిర్మాత తేజ చెప్పారు.



వెంకన్న ఒక్కరోజు ఆదాయం
రూ.2.89 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 4: కోనసీమ తిరుపతి వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,89,111 లభించినట్లు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

భీమేశ్వరాలయానికి విదేశీ భక్తులు


ఆలయంలో విదేశీ భక్తులు

సామర్లకోట, ఫిబ్రవరి 4: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం ఇటలీ దేశానికి చెందిన లూయిజా కుటుంబానికి చెందిన నలుగురు విదేశీ భక్తులు స్వామివారిని, బాలాత్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిజా విలేకరులతో మాట్లాడుతూ తమ కుటుంబం ఇటలీలో ప్రముఖ ఆధ్యాత్మిక కుటుంబంగా పేర్గాంచిందని తాము చరిత్ర అధ్యయనం చేస్తూ పంచారామాల విశిష్టత గురించి తెలుసుకున్నామన్నారు. పంచారామాలలో సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం ఎంతో గొప్పదని తాము చదివిన చరిత్రను స్వయంగా వీక్షించి తన్మయత్వం చెందామని చెప్పారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ శిల్పకళా సంపదను చూసి వాటి వద్ద నిల్చుని ఫొటోలు తీసుకునేందుకు అత్యంత ఉత్సాహం కనబర్చారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

సీనియర్స్‌లో గుమ్మిలేరు, జూనియర్స్‌లో జమ్మిగొల్లేపల్లి విజేతలు


పరుగులు తీస్తున్న ఎడ్లు

సామర్లకోట, ఫిబ్రవరి 4: కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామభీమేశ్వర రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉండూరు రైల్వేగేట్-ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆదివారం వందలాది మంది రైతులు, పశు పోషకుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం చంద్రమౌళి సౌజన్యంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలకు మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం, ప్రముఖ వ్యాపారవేత్త చందలాడ పద్మరాజు (బాబ్జీ) హాజరయ్యారు. నిర్ణీత దూరాన్ని తాకి తిరిగి వచ్చేందుకుగాను నిర్వహించిన ఈ పోటీలలో జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరాశృతి చౌదరి ఎడ్లు 5.37.59 పాయింట్లతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా ద్వితీయ, తృతీయ స్థానాలను వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్ సామర్లకోట ఎడ్లు 5.44.97 పాయింట్లతోనూ, కోరా శృతి చౌదరి గుమ్మిలేరు ఎడ్లు 5.49.51 పాయింట్లతోనూ కైవసం చేసుకున్నాయి. అలాగే జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని జమ్మిగొల్లేపల్లి నలజాల నరసింహారావు ఎడ్లు 4.13.72 పాయింట్లతోనూ, ద్వితీయ స్థానాన్ని మండపేట వేగుళ్ల నారయ్య చౌదరి ఎడ్లు 4.17.19 పాయింట్లతోనూ, తృతీయ స్థానాన్ని వెల్దుర్తి మొగలి ఏసుబాబు ఎడ్లు 4.23.13 పాయింట్లతోనూ కైవసం చేసుకున్నాయి. విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమాన్ని డాక్టర్ చందలాడ అనంతపద్మనాభం, చందలాడ పద్మరాజు(బాబ్జీ) చేతులమీదుగా నగదు బహుమతులు, షీల్డ్‌లను అందజేశారు. సీనియర్స్ విభాగంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 9 జతల ఎడ్లు, జూనియర్స్ విభాగంలో 30 జతల ఎడ్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. పోటీల నిర్వాహకులుగా కాటూరి జానకీరామ్, కొండపల్లి కృష్ణమూర్తి, గోలి వెంకటఅప్పారావుచౌదరి, పైన్ది చిట్టియ్య, బిక్కిన శ్రీరంగనాయకులు, పైన్ది గౌరీచంద్, రామకృష్ణ వ్యవహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. సామర్లకోట పరిసర ప్రాంతాల నుంచి రైతులు, పశు పెంపకందారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సీనియర్స్ విభాగంలో విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

ఏజెన్సీ సమాచారం

మోతుగూడెంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

మోతుగూడెం, ఫిబ్రవరి 4: చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద ఇన్‌చార్జ్ ఎస్ఐ శివకుమార్, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడపినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా శిక్షార్హులన్నారు. ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పర్యాటకులు ముసుగులో కొంత మంది గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐలు సూర్యనారాయణరావు, రాజేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్



ఎంపికైన లోయర్ సీలేరు క్రికెట్ జట్టు

మోతుగూడెం, ఫిబ్రవరి 4: చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం లోయర్ సీలేరు స్పోర్ట్స్ క్లబ్ ఏపీ జెన్కో క్రికెట్ మైదానంలో క్రికెట్ సెలక్షన్స్ జరిగాయి. లోయర్ సీలేరు స్పోర్ట్స్ కమిటీ ఛైర్మన్, సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, స్పోర్ట్స్ ప్రెసిడెంట్, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ జనరల్ సెక్రటరీ, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ట్రెజరర్ పి.ఆనంద్, లోయర్ సీలేరు స్పోర్ట్స్ సెక్రటరీ సతీష్ రాఘవన్ ఆధ్వర్యంలో సెలక్షన్స్ నిర్వహించారు. లోయర్ సీలేరు నుంచి క్రికెట్ టీంకు 16 మంది ఎంపికయ్యారు. నెల్లూరులో ఈ నెల 5న జరిగే ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌కు జట్టు పయనమైంది. వారిని విజయం సాధించాలని ప్రోత్సహించారు.

పాపికొండలకు పర్యాటకుల తాకిడి

దేవీపట్నం, ఫిబ్రవరి 4: గోదావరి తీరాన ఉన్న పాపికొండల అందాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రకృతి ప్రేమికులు తరలివచ్చారు. ఆదివారం మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి తొమ్మిది బోట్లలో సుమారు 800 మంది పర్యాటకులు పాపికొండలు వెళ్లి పేరంటాలపల్లిలో సందడి చేశారు.

వైద్య శిబిరంలో 250 మందికి వైద్యసేవలు



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

రంపచోడవరం, ఫిబ్రవరి 4: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందపాడులో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 250 మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ తెలిపారు. 60 మందికి రక్తపరీక్షలు, 11 మందికి థైరాయిడ్ పరీక్షలు, 19 మందికి ఎక్స్‌రేలు, 13 మందికి ఫిజియోథెరపీ చేసినట్లు తెలిపారు. వేమగిరి పరమహంస నేత్రాలయం ఆధ్వర్యంలో 53 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 11 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశామన్నారు. కంటి ఆపరేషన్ల కోసం 11 మందిని వేమగిరి తరలించినట్లు తెలిపారు. అనంతరం రోగులు, సహాయకులకు అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు దాసరి ఉమా మహేష్, తలారి వెంకటసుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, క్యాంపు కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటిబాబు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి



ఘాట్‌రోడ్డులో ప్రమాద దృశ్యం

రంపచోడవరం, ఫిబ్రవరి 4: మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మానవత్వాన్ని చాటుకున్నారు. టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వంతల రాజేశ్వరి ఘాట్‌రోడ్డు మీదుగా చింతూరు బయలుదేరారు. మార్గమధ్యంలో దివ్యాంగుడు ద్విచక్ర వాహనంలో ప్రమాదానికి గురై స్పృహ కోల్పోయి పడిపోయాడు. అటుగా వెళుతున్న రాజేశ్వరి గమనించి తన సొంత వాహనంలో క్షతగాత్రుడిని మారేడుమిల్లి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు.

8న చలో విజయవాడ

» ఏపీ మధ్యాహ్న భోజన పథక కమిటీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు

గోపాలపురం, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ఛార్జీలు పెంచాలని ఈ నెల 8న చలో విజయవాడకు పిలుపునిచ్చినట్టు ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథక కమిటీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బుచ్చిబాబు ఆదివారం తెలిపారు. ఈ మేరకు చలో విజయవాడ కరపత్రా లను మధ్యాహ్న భోజన పథక కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలకు వాస్తవ ఖర్చులకు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. కార్మికులకు పని భారం పెంచడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచక పోవడంతో తమ పరిస్థితి అప్పు చేసి పప్పుకూడు అన్న చందంగా మారింద న్నారు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి కార్మికులను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహి స్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులంతా తరలిరావా లన్నారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, బీరపాప, వెంకయమ్మ, లక్ష్మీకాంతం, సుశీల, పుష్ప, గుడిసే రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రాజానగరం కాంగ్రెస్ సీటు కేటాయించండి'

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4: రాజానగరం నియోజకవర్గం శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిత్వంను కోరుతూ డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్లమాచరయ్య ఆదివారం దరఖాస్తు సమర్పించారు. ఈ విషయాన్ని ఫోన్‌ద్వారా తెలిపారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో సంబంధితులకు తన దరఖాస్తును అందజేశానని అన్నారు. తాను కాంగ్రెస్‌పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈసీటు కేటాయించాలని కోరానన్నారు. కార్యక్రమంలో తనతోపాటు మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కోడి నాగేశ్వరరావు, నాయకులు మిరియాల బాబి, రావిపాటి శ్రీను, ఆలపాటి గోవిందు పాల్గొన్నారు.

శ్రీరామునిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

గోకవరం, ఫిబ్రవరి 4: హిందువుల ఆరాధ్యదైవమైన శ్రీరాముడుపై కత్తి పద్మారావు అనే వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు పిలుపుమేరకు ఆదివారం గోకవరంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా రామసేన సభ్యులు దేవిచౌక్ సెంటర్ నుంచి ప్రదర్శనగా బయలుదేరి ఆంజనేయస్వామిగుడి సెంటర్‌వద్ద ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. హిందూవుల ఆరాధ్యదైవం శ్రీరామచంద్రుడిని వ్యక్తి గతంగా దూషించడం పద్మారావుకు తగదన్నారు. హిందూవుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన పద్మారావుపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆందోళనకారులు ఎస్ఐ నాగరాజుకు వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి బావన్నదొర, ఉంగరాల ఆదివిష్ణు, బాడితబోయిన అబ్బులు, నరాలశెట్టి నరసయ్య పాల్గొన్నారు.



గోకవరం దేవిచౌక్ సెంటర్‌వద్ద ధర్నా చేస్తున్న విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు

బీజేపీ 15ఏళ్ల పాలన దేశాకి ఆదర్శం

● ఎన్నికల సన్నాహక సభలో ఏపీఆర్ చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఆర్ చౌదరి

కోరుకొండ, ఫిబ్రవరి 4: స్వాతంత్ర భారతదేశంలో భారతీయ జనతా పార్టీ గతంలో వాజ్‌పాయ్ 5 సంవత్సరాల పాలన, మోదీ 10 సంవత్సరాల పాలన దేశానికి ఆదర్శమని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏపీఆర్ చౌదరి పేర్కొన్నారు. రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక, పల్లెకు పోదాం సమావేశం ఆదివారం సాయంత్రం కోరుకొండ సుబ్రహ్మణ్య మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి విశ్వనాథరాజు మాట్లాడుతూ ఈనెల 9, 10, 11 తేదీల్లో బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు, దార్మిక పరిషత్ రాష్ట్ర కన్వీనర్ గోపీనాథ్, జిల్లా నాయకులు దొరబాబు, మోది సత్తిబాబు, ఆంజనేయులు, దుర్గారావు, మండల కన్వీనర్ నీలపాల వెంకన్న, ఆళ్ళ శివనాగరాజు, గూడపాటి విజయరాం, నియోజకవర్గ కో కన్వీనర్ అడబాల గణపతి, స్థానిక నాయకులు పచ్చారి నరసింహమూర్తి, తగరంపూడి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం ఎంపీ టీడీపీ సీటును బీసీలకు ఇవ్వాలి

● జిల్లా బీసీ సంక్షేమ సంఘం నేతలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరం ఎంపీ సీటును టీడీపీ కూడా బీసీలకు కేటాయించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడారు. చట్టసభల్లోకి ఎక్కువ మంది బీసీలు వెళ్లాలని అప్పుడే బీసీల సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. వైసీపీ రాజమహేంద్రవరం ఎంపీ సీటును బీసీలకు కేటాయించిందని, అలాగే టీడీపీ కూడా బీసీలకు సీటు కేటాయిస్తే బాగుటుందన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు మేడిశెట్టి తాతబ్బాయి మాట్లాడుతూ బీసీలకు అత్యధికంగా సీట్లు కేటాయించే పార్టీకి తమ మద్దతు ఉంటుందన్నారు. బీసీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సంఘం కూడా కృషి చేస్తుందన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గొర్రా తాతబ్బాయియాదవ్, ఉప్పిడి గంగాధర్, గుత్తుల సుబ్రహ్మణ్యం మాట్లాడారు. బీసీలకు ప్రధాన రాజకీయపార్టీలు వంద సీట్లు కేటాయించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

రాజానగరాన్ని దోపిడీ నుంచి రక్షిస్తా

● గాడాల సదస్సులో బత్తుల బలరామకృష్ణ



ఆదివారం రాత్రి జరిగిన సంసిద్ధం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, ఫిబ్రవరి 4: రాజానగరం నియోజకవర్గాన్ని దోపిడీ పాలన నుంచి రక్షిస్తానని ప్రశాంతమైన వాతావరణంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ ఆదివారంరాత్రి గాడాలలో జరిగిన సంసిద్ధం ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. కోరుకొండ మండలం గాడాలలో ఆదివారంరాత్రి జనసేన, టీడీపీల ఆత్మీయ సమావేశంలో బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ వైసీపీ పాలనపై విరుచుకుపడ్డారు. గడిచిన 5 సంవత్సరాల పాలనలో రాజానగరం నియోజకవర్గం పెద్దఎత్తున దోపిడీకి గురైందన్నారు. నియోజకవర్గంలో కొండలు, గుట్టలు, ఇసుక దోచుకుపోయారన్నారు. రాజానగరం నియోజకవర్గం నుంచి స్థానికేతరులను తరమివేస్తానని ఎమ్మెల్యే జక్కంపూడిని ఉద్దేశించి బత్తుల ఆవేశంగా మాట్లాడారు. కరోనా సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తన సొంత డబ్బు ఖర్చుపెట్టి ప్రజలను ఆదుకున్నామని గుర్తు చేశారు. సమావేశంలో రాజానగరం నియోజకవర్గానికి చెందిన జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేనకు ఈస్‌వెస్ట్ డ్రైవర్స్ అసోసియేషన్ మద్దుతు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4: జనసేన పార్టీకి ఈస్‌వెస్ట్ డ్రైవర్స్ అసోసియేషన్ మద్దతు ఇచ్చింది. ఆదివారం రాజమహేంద్రవరంలో జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణను అసోసియేషన్ అధ్యక్షుడు గోగులపాటి ఆధ్వర్యంలో డ్రైవర్లు కలిశారు. తామంతా జనసేనకు మద్దత్తుగా నిలవాలని నిర్ణయించామని త్వరలో వందలాది మందితో పార్టీలో చేరుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అనుశ్రీ మాట్లాడుతూ అన్ని వర్గాల రాబోయే రోజుల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వంలో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



అనుశ్రీకి మద్దతు తెలుపుతున్న డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వ స్థాపనకు సహకరించాలి

● జనసేనపార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ పాటంశెట్టి సూర్యచంద్ర

గోకవరం, ఫిబ్రవరి 4: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వ స్థాపనకు ప్రతీఒక్కరూ సహకరించాలని జనసేనపార్టీ జగ్గంపే ట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాంటశెట్టి సూర్యచంద్ర అభ్యర్థించారు. గోక వరంలో ఆదివారం ఆయన జనంకోసం జనసేన మహయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి గడపగడపకు తిరిగి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలతో కూడిన కరపత్రాలను వారు ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.



గోకవరంలో ప్రచారం నిర్వహిస్తున్న సూర్యచంద్ర

'వైసీపీతోనే గ్రామాల అభివృద్ధి'



సుభద్రంపేటలో ఆర్‌బీకే శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో గల గ్రామాలు అన్నీ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాతే అభివృద్ధి చెందాయని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం రంగంపేట మండలం సుభద్రంపేట గ్రామంలో జడ్పీటీసీ సభ్యులు పేపకాయల రాంబాబు ఆధ్వర్యంలో 43 లక్షలతో, సచివాలయం, 23 లక్షలతో రైతుభరోసా కేంద్రం, 20 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజవర్గం వైసీపీ అభ్యర్థిగా నియమితులైన గూడూరి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కొల్లాటి ఇశ్రాయేలు, పోతుల బులివీర్రాజు, నల్లా శ్రీనివాస్, మాచిన గోవింద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అద్వానీకి భారతరత్న దేశానికే గర్వకారణం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4: దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఎల్.కె. అద్వానీకి భారతరత్న ప్రకటించడం దేశానికే గర్వకారణం అని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బలభద్ర వీరవెంకట సత్యనారాయణ ఆదివారం అన్నారు. అసలు సిసలైన హిందూదేశ నాయకుడు అద్వానీ అని, వారికి దేశ అత్యున్నతపురస్కారం ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజా

కోరుకొండ, ఫిబ్రవరి 4: ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని రాజానగరం నియోజకవర్గంలో 26 మంది లబ్దిదారులకు రూ.35.68లక్షలు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందజేశారు. అదేవిధంగా మరో ఐదుగురికి రూ.13లక్షలు చెక్కులు పంపిణీ చేశారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామ కళాకారులు ఇటీవల రోడ్ల ప్రమాదంలో కోల్పోవడం, మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారని వారికి ప్రభుత్వపరంగా చేయూత అందించామన్నారు.

శ్రీగాయత్రి మంత్రం జపించడానికి ఆధ్యాత్మిక సాధన చేయాలి



రంగంపేటలో విద్యార్థులతో గాయత్రి మంత్రం సాధన చేయిస్తున్న గురువు శ్రీనివాసరాజు

రంగంపేట, ఫిబ్రవరి 4: శ్రీగాయత్రి మంత్ర విశిష్టతను తెలుసుకొని నిత్యం జపించడానికి ఆధ్యాత్మిక సాధన చేయాలని శ్రీ సత్యసాయి సేవా సంస్థల విద్యా విభాగ జిల్లా సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు సూచించారు. ఆదివారం రంగంపేటలో శ్రీసత్యసాయి బాలవికాస్ విద్యార్థులచే శ్రీసత్యసాయి చిత్రపటానికి సామూహిక తండులార్చన చేయించి, వారిని ఉద్దేశించి మాట్లాడారు. మానవతా విలువలను పెంపొందించే బాలవికాస్ తరగతులకు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు. అలాగే ఈలకొలను, కోటపాడు గ్రామాలలో కూడా బాలవికాస్ విద్యార్థులు తండులార్చన చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బాలవికాస్ కేంద్రాలలో విద్యార్థులు సామూహిక తండులార్చన నిర్వహించి, గాయత్రి, సాయి గాయత్రి మంత్రం పఠనం చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి, భజన మండలి కన్వీనర్లు, బాలవికాస్ గురువులు పాల్గొన్నారు.

కణుపూరులో ఇళ్ల పట్టాల పంపిణీ

కోరుకొండ, ఫిబ్రవరి4: మండలంలోని కణుపూరు గ్రామంలో 95 మంది లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారి సొంతింటి కల నెరవేర్చడానికి సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 31.75 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరణం రమణ, మాజీ సర్పంచ్ కల్యాణం చిట్టిబాబు, కల్యాణం రాంబాబు, గ్రామ వైసీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ కోరుకొండ వెంకటలక్ష్మి, కటకం బాబ్జి, దొరబాబు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి

జైళ్లలో బాలబాలికలు ఉండరాదు: డీఎల్ఎస్ఏ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చట్టంతో విభేదించిన బాలబాలికలు కారాగారాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండడానికి వీల్లేదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి స్పష్టం చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన 'యువతను పునరుద్ధరించడం' కార్యక్రమంలో భాగంగా కేంద్ర కారాగారాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 18ఏళ్ల లోపు వారు న్యాయస్థానాల్లో వయసు రుజువు చేసుకోవడానికి అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. అలాంటివారు ఎవరైనా ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఖైదీలు జైలుకు వచ్చిన సందర్భంలోనే జైలు సిబ్బంది వయసు విషయంలో శ్రద్ధ చూపాలని, 18ఏళ్లు నిండలేదని అనుమానం వస్తే వెంటనే తమకు తెలియజేయాలన్నారు.

టీడీపీలోకి చేరిన మాజీ ఎంపీపీ సూర్యనారాయణ



నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ సూర్యనారాయణ, సీతారామకృష్ణ

గోకవరం, ఫిబ్రవరి 4: గోకవరం మాజీ ఎంపీపీ డీ.వి.వి.సూర్యనారాయణ ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. డీ.వి.వి. తన స్వగృహంలో జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. సూర్యనారాయణతో పాటు ఆయన కుమారుడు సీతారా మకృష్ణ కూడా టీడీపీలో చేరారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నెహ్రూపై ఉన్న అభిమానంతో తాను కాంగ్రెస్ పార్టీని వీడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బదిరెడ్డి అచ్చన్నదొర, మలిరెడ్డి సిరి, పెద్దాడ వెంకన్నదొర, గెడ్డం బాబు, తదితరులు పాల్గొన్నారు.

దోసాలమ్మ జాతరకు శ్రీకారం



దోసాలమ్మ జాతరకు పందిరిరాట వేస్తున్న కేపీఆర్ సంస్థల చైర్మన్ పాపారెడ్డి

బిక్కవోలు, ఫిబ్రవరి 4: కొమరిపాలెం గ్రామ దేవత దోసాలమ్మ వారి జాతర ఉత్సవాలకు ఆదివారం కేపీఆర్ సంస్థల చైర్మన్ కొవ్వూరి పాపారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఆయన పందిరి రాట వేసి ఉత్సవ పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈనెల 10న అమ్మవారి జాతర, సంబరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి చినబుజ్జి, తాడి అరవిందం, పారిశ్రామిక వేత్తలు చింతా పాండు రంగారెడ్డి, వెంకటరెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ కొవ్వూరి సురేష్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పూజా కార్యక్రమాలు



బాబా వారి పల్లకీమహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


కడియం, ఫిబ్రవరి 4: మండలంలోని వేమగిరిలో నూతనంగా నిర్మించిన సాక్షి గణపతి సాయినాథ దత్తాత్రేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. ఉదయం కాకడ హారతితో మొదలై పంచామృతాభిషేకాలు, నూతన వస్త్రాలంకరణ, నిత్యపూజాది కార్యక్రమాలు, సాయి సత్యవ్రతాలు, సంధ్యాహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. బాబావారి పల్లకీసేవ సందర్భంగా జరిగిన గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం సంధ్యాహారతి, తేజోహారతి నిర్వహించారు. పలువురు దాతలను సత్కరించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు పేరూరి కాశీరాజ్‌కుమార్-లక్ష్మీ దంపతులు, దుళ్ల వేంకటేశ్వరరావు-తులసి దంపతులు పీటలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: కిస్మత్
సూర్యామినీ	: గేమ్ ఆన్
సూర్యాప్యాలస్	: ఫైటర్, హాపీ ఎన్‌డింగ్
స్వామి	: బూట్‌కట్ బాలరాజు
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	:
ఊర్వశి	: నా సామి రంగ
రంభ	: కెప్టెన్ మిల్లర్
మేనక	: ధీర
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
వీఎస్ మహాల్(నామవరం)	: హనుమాన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
వెంకటసూర్య(కడియం)	: హనుమాన్
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
రామకృష్ణ(కోరుకొండ)	: హనుమాన్
గీతాసినిమాస్ (సీతానగరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
లలితామహాల్(రంపచోడవరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
నవయుగ(చింతూరు)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 5 ఫిబ్రవరి 2024 | 3



నేడు స్పందన యథాతథం


రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 4: జిల్లాలో సోమవారం యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు. అలాగే డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, మునిసిపాలిటీల్లో కమిషనర్లు, మండల స్థాయిలో అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

ఓటుకు.. చేటు!




చనిపోయినా.. బతికించేశారు..

ఈ చిత్రంలో చూస్తున్నారుగా.. మొత్తం 13 ఓట్లు.. దేవరపల్లి మండలం పల్లంట్లకు చెందిన ఈ 13 మంది చాలా కాలం కిందట చనిపోయారు.. అయితే ఇటీవల విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాలో పేర్లు ఉండడం చూసి కుటుంబీకులే అవాక్కయ్యారు. అధికారులేం చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే మరి.



ఇలాగైతే.. ఓటెలా!

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఓటు చూశారా.. ఇది తీపర్రుకు చెందిన నల్ల సూర్యారావు ఓటు... ఆయన చనిపోయి చాలా కాలమైంది.. అయితే ఇటీవల విడుదల చేసిన ఓటరు తుది జాబితాలో ప్రత్యక్షమైంది.. కుటుంబీకులు ఈ ఓటు ఎలా వచ్చింది చెప్మా అంటూ అవాక్కయ్యారు.. ఈ కింద యువతి ఓటు చూశారా.. ఫొటో ఉంది.. పేరు మాయమైంది.. ఆ యువతి ఓటు ఎలా వేయాలి.. ఓటరు జాబితాల్లో ఇలా ఎన్నో సిత్ర విసిత్రాలు తారసపడుతున్నాయి..



తప్పుల తడకగా ఓటర్ల తుది జాబితా

- చనిపోయినా.. ఓటిచ్చారు
- ఓటరు జాబితాల్లో మృతుల పేర్లు
- అవాక్కవుతున్న కుటుంబీకులు
- గ్రామగ్రామాన జాబితాల్లో తప్పులే
- పెరవలి, దేవరపల్లి మండలాల్లో ఇలా
- చక్రద్వారబంధంలో 33 మంది పేర్లు
- తుది జాబితాపై అయోమయం

ఓటుందో లేదో చూస్కోండి బాబూ.. ఎందుకంటే చనిపోయిన వారిని బతికించేశారు.. బతికున్నవారిని చంపేశారు.. ఓటు తుది జాబితాలో సిత్రవిసిత్రాలు అన్నీ ఇన్నీ కావు.. తప్పేకొద్దీ బయటపడుతూనే ఉన్నాయి.. రాజానగరం మండలం చక్రద్వారబంధంలో 33 మంది చనిపోయిన వారి ఓట్లు బయటపడడం మరువక ముందే.. పెరవలి మండలం కానూరు అగ్రహారంలో చనిపోయిన వారి 20 ఓట్లు బయటపడ్డాయి.. దేవరపల్లిలో చూస్తే 13 మృతుల ఓట్లు ఉండడం గమనార్హం.. ఆ నోటా ఈ నోటా సంగతి తెలియడంతో ఓటుందో లేదో తెలుసుకునేందుకు జనం పరుగులు పెడుతున్నారు..

పెరవలి, ఫిబ్రవరి 4 : ఓటర్ల తుది జాబితాలు తప్పుల తడకగా తయారయ్యాయి.. ఏ జాబితా చూసినా ఏదో ఒక చోట తప్పులు కనిపిస్తూనే ఉన్నాయి.. జాబితాలో చనిపోయిన వారు నేటికీ బతికే ఉన్నారు. ఇలా ఒక్కో జాబితాలో 20 నుంచి 30 వరకూ ఓట్లు కనిపిస్తుండడం గమనార్హం. డబుల్ ఎంట్రీలు.. ఫొటోలు లేకుండా ఇలా రకరకాలుగా ఉన్నాయి. దీనిపై ఓటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత మంది అధికార యంత్రాంగం ఉండి ఏం లాభం అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 16 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు 1569 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఓటర్ల జాబితా సవరణ అనంతరం కొత్తగా విడుదల చేసిన జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అన్ని గ్రామాల్లోనూ చనిపోయిన వారి పేర్లు తొలగించలేదని.. ఒకే వ్యక్తికి రెండు, మూడు ఓట్లు ఉన్నా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల ఫొటోలు లేవు.. మరికొన్ని చోట్ల పేర్లు సక్రమంగా లేవు.. ఒక వార్డులోని పేర్లు వేరొక చోటకు మార్చడం తదితర కారణాలతో ఓటుపై అయోమయం నెలకొంది. తీపర్రులో నల్ల సూర్యారావు మృతిచెందినప్పటికి ఆయన ఓటును జాబితా నుంచి తొలగించలేదు.. ఇదేవిధంగా సుమారు పది మంది పేర్లు తొలగించలేదని సమాచారం. కానూరు అగ్రహారంలో సుమారు 20 మంది చనిపోయిన వారి పేర్లు ఉన్నట్టు సమాచారం. 17 మంది డబుల్ ఎంట్రీలు ఉన్నాయి.. ఫొటోలు లేకుండా మరో 15 మంది ఉన్నారు. ఒక వార్డు నుంచి వేరొక వార్డుకు మార్చవలసినవిగా, ఒక బూత్‌నుంచి వేరొక బూత్‌కు మార్చవలసినవి ఎక్కువగా ఉన్నాయి. నడిపల్లిలో కూడా సుమారు 20 మంది మృతుల ఓట్లు తొలగించలేదు. డబుల్ ఎంట్రీ ఉన్నవి ఐదు ఉన్నాయి. మండలంలోని గ్రామాల్లో జాబితాలు తప్పులతడకగా ఉన్నాయని ఆరోపించారు.

దేవరపల్లిలో 13 మంది..

దేవరపల్లి, ఫిబ్రవరి 4 : ఓటర్ల జాబితాలో క్షేత్రస్థాయిలో ఇంటింటికి సర్వే చేసి పరిశీలన తరువాత తుది జాబితా విడుదల చేసినట్టు ప్రభుత్వ యంత్రాంగం చెప్పినప్పటికీ అన్ని గ్రామాల్లోనూ ఓటరు జాబితాల్లో లోపాలు కనిపించడం విశేషం. దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామసచివాలయం 111, 112 పోలింగ్ బూత్‌ల పరిధిలో 2 వేల మంది ఓటర్లు ఉండగా ఓటర్ జాబితాను పరిశీలించగా 13 మంది మృతి చెందినవారి ఓట్లు ఉండడం గమనార్హం. ఎస్తేరు ఈదూరి, కృష్ణయ్య కొయ్యా, ఏసురత్నం పెదపాటి, ఆశీర్వాదం ఐనపర్తి, గెల్లా అనూష, సత్తియ్య మెరిపో, గొయ్యమ్మ రాయుడు, కృష్ణారావు నూతలపాటి, కృపమ్మ రాయుడు, రాజారావు నిట్టా, సత్తెమ్మ అక్కాబత్తుల, దానమ్మ రాయుడు పేర్లు ఓటర్ల జాబితాలో ఉన్నాయి. డబుల్ ఎంట్రీలో దుర్గా పొన్నాడ, పృథ్వీరాజు చాపల పేర్లు ఉన్నాయి. 3 నుంచి ఆరేళ్ల కిందట చనిపోయిన మృతుల ఓట్లు తొలగించకుండా యథాతథంగా ఓటర్ల లిస్టులో ఉండడం గమనార్హం. వీఆర్వోలు, ఓటర్ లిస్టులో డబుల్ ఎంట్రీలు రాకుండా, మృతి చెందిన వారి పేర్లు తొలగించకుండా తుది జాబితా విడుదల చేయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. యర్నగూడెంలో మృతిచెందిన ఓటర్ల డబుల్ ఎంట్రీలు ఉండడంతో యర్నగూడెం గ్రామానికి చెందిన బీఎల్‌వో కే.శశిప్రియాంకను జిల్లా కలెక్టర్ మాధవీలత సస్పెండ్ చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఓటర్ల జాబితాలో ఉంది. దీనిపై అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

అమ్మో పులి



గత రెండు వారాలుగా పులి భయపెడుతూనే ఉంది.. ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని అడవిని సరిహద్దుగా చేసుకుని తిరుగుతూనే ఉంది.. జనం ఏ క్షణం ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతూనే ఉన్నారు.. అయినా అటవీ సిబ్బందిలో మాత్రం కదలిక లేదు.. పులిని పట్టుకుందామన్న చొరవ కనిపించడంలేదు.. శుక్రవారం రాత్రి కరగపాడు వద్ద రిజర్వు ఫారెస్టులో ట్రాపింగ్ కెమెరాకు చిక్కిన పులి.. ఆదివారం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం లక్ష్మీపురం వద్ద ఆవుపై దాడి చేసి చంపేసింది.. దీంతో ఏజెన్సీ వాసులు భయపడుతున్నారు. పులిని పట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.. - వివరాలు 5లో



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేఎస్ జవహర్

హక్కుల కోసం పోరాడాలి

ఏపీటీఎఫ్ జిల్లా సమావేశంలో నాయకుల పిలుపు

కొవ్వూరు, ఫిబ్రవరి 4 : ఉద్యోగ, ఉపాధ్యాయులు హక్కులు, సౌకర్యాల సంరక్షణకు నేడు పోరాటం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.ఎ. సాల్మన్‌రాజు పిలుపునిచ్చారు.కొవ్వూరు హోలి ఏంజిల్స్ పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలు వెట్టిచాకిరికి గురిచేసే విధానాన్ని పోరాడి రద్దు చేయించుకున్నారని, నేడు గౌరవ వేతనం పేరుతో తిరిగి ప్రవేశపెట్టాలనే ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మేలు చేకూర్చేలా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలన్నారు. 12వ పీఆర్‌సీని అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీమంత్రి, ఏపీటీఎఫ్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు కె.ఎస్.జవహర్ మాట్లాడుతూ 117 జీవోను తక్షణం రద్దు చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 117 జీవోను రద్దు చేస్తామన్నారు. ఎన్నికల ముందు విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని, వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని అన్న నాయకులు ఏమి చేశారో గమనించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ మునిసిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, జీపీఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దున్నా దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా పి.సువర్ణరాజు, ఉపాధ్యక్షులుగా పి.గంగరాజు, ఎం. వెంకటరావు, ఎ.పద్మలత, ఐ.సూర్యనారాయణ, కార్యదర్శులుగా ఎస్.రాజశేఖర్, కె.వి.రాఘవులు, వి.అనితాజ్యోతి, పీవీ.కృష్ణమోహన్, బి.రాంబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సలీంలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంతో సాల్మన్‌రాజు ప్రమాణ స్వీకారం చేయించారు.

టెన్త్ ఫలితాలు మెరుగుపడాలి

జిల్లా బీసీ సంక్షేమాధికారి సత్యరమేష్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4 : జిల్లాలోని బీసీ హాస్టళ్లలో 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులు మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి పి.సత్యరమేష్ అన్నారు. రాజమహేంద్రవరం బీసీ స్టడీ సర్కిల్‌లో టెన్త్ విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం ఏర్పాటు చేసిన శిక్షణ, ప్రేరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హాస్టల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయుల శిక్షణకు సహకరించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ ఏబీసీడబ్ల్యువో పి.రామకృష్ణ, హెచ్‌డబ్ల్యువోలు ముత్యాల సుబ్బారావు, ఆర్.చిరంజీవి, పి.సరోజ, కేజీ కాత్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు సర్పంచ్‌ల చలో అసెంబ్లీ

కొవ్వూరు, ఫిబ్రవరి 4 : సర్పంచ్‌ల సమస్యలపై ఈ నెల 6వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్టు సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు పాలడుగుల లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 14,15 ఆర్థిక సంఘం నిధులు రూ.8629 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించి, దారి మళ్లించిందన్నారు. ఆయా నిధులను గ్రామ సర్పంచ్‌ల ఖాతాల్లో జమచేయాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్పంచ్‌ల ఆధీనంలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ నిధులు చట్ట ప్రకారం పంచాయతీలకు ఇచ్చి సర్పంచ్‌ల చేత ఖర్చు చేయించాలన్నారు. పంచాయతీలకు ఉచిత విద్యుత్ అందించాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రూ.15 వేలు చొప్పున, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ. 30 వేలు వంతున గౌరవ వేతనం అందజేయాలన్నారు. సర్పంచ్‌ల 16 డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సర్పంచ్‌లు, రాజకీయాలకతీతంగా ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు అమరావతిలోని అసెంబ్లీ వద్దకు చేరుకుని చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



కోటసత్తెమ్మ.. కరుణించమ్మా

నిడదవోలు, ఫిబ్రవరి 4 : కోటసత్తెమ్మ కరుణించమ్మా అంటూ భక్తులు పెద్ద ఎత్తున నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు.ఆదివారం ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవతో ప్రారంభమై ధూప హారతి, నిత్యార్చన, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు.ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.2,02,229లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.



సీట్లు.. సిగపట్లు!

తూర్పున రాజకీయ కాక

- ఎన్నికలకు సిద్ధమైన నాయకులు
- ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూల్
- సీట్ల ఖరారులో అధినేతలు
- ఆచితూచి అడుగులు
- త్వరలోనే టీడీపీ-జనసేన ప్రకటన
- 4 స్థానాలకు ప్రకటించిన వైసీపీ
- మూడు స్థానాలపై అటెన్షన్
- ఎంపీ అభ్యర్థిగా గూడూరి
- బదిలీలపై సిట్టింగ్‌ల అసహనం
- బరిలో బీజేపీ, వామపక్షాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలు ఇక కూతవేటు దూరంలో ఉన్నాయి. ఈ నెలలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. తర్వాత నోటిఫికేషన్ వస్తుంది. ఇక ఎన్నికలు జరగడానికి ఎన్నో రోజులు లేవు. మండుటెండల్లో ఎన్నికలు జరగనున్నాయి. కానీ ఇప్పటి నుంచే జిల్లాలో పొలిటికల్ హీట్ మొదలైంది.టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం అమరావతిలో భేటీ అయిన సంగతి తెలిసిందే.రెండు పార్టీల నుంచి ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేయాలి..ఏ పార్టీ ఎన్నిచోట్ల పోటీ చేయాలనే విషయంలో ఇద్దరు పెద్దలు ఒక అభిప్రాయానికి వచ్చినట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో త్వరలోనే తెలుగుదేశం, జనసేన అభ్యర్థుల జాబితా అధికారికంగా రానుంది. దీంతో టీడీపీ- జనసేనలో చేరికలు పెరుగుతున్నాయి. అనేక వర్గాలు ముందుకు వచ్చి చేరుతున్నారు.ఆయా చోట్ల టికెట్లు ఆశించేవారు ఆయా వర్గాలను ఆకట్టుకునే పనిలో ఉన్నారు.ఇక టికెట్ల విషయంలో ఇప్పటికే జిల్లాలో కొందరు అభ్యర్థులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. రాజమహేంద్రవరం సిటీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే భర్త, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్‌కార్యదర్శి ఆదిరెడ్డి వాసుకు, అనపర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి,గోపాలపురం నుంచి మద్దిపాటి వెంకట్రాజుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మిగతా చోట్ల అధికారికంగా ప్రకటించే వరకూ కొంత సందిగ్ధత కొనసాగనుంది. ఇక రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని స్వయంగా పవన్‌కల్యాణ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్కడ అభ్యర్థి పేరు ప్రకటించకపోయినా నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఇప్పటికే మీటింగ్‌లు పెట్టి, తానే అభ్యర్థినని పబ్లిక్‌గా చెబుతున్నారు. నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటున్నారు. ఇక్కడ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ కూడా ఈ సీటు తనకే హామీ ఇచ్చారని,కొద్దిరోజుల్లో గందరగోళానికి తెరపడుతుందని ఆయన అంటున్నారు. రాజమహేంద్రవరం రూరల్ నుంచి ఎమ్మెల్యే టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తాను తిరిగి రాజమహేంద్రవరం రూరల్ నుంచే పోటీ చేస్తానని ఖరాఖండీగా చెబుతున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ తిరిగి టికెట్లు ఇస్తామని గతంలోనే ప్రకటించడంతో ఆయన నియోజకవర్గంలో పార్టీ పనిలో నిమగ్నమయ్యారు.పైగా ఇటీవల ఆయన నియోజకవర్గం పరిధిలోని కాతేరులో నిర్వహించిన రా కదలిరా బహిరంగ సభ ఊహించిన దానికంటే విజయవంతం కావడంతో ఆయన మరింత హుషారుగా ఉన్నారు.కానీ ఇదే స్థానం నుంచి జనసేన కీలకనేత, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ పోటీ చేస్తానని..ఇప్పటికే తనకు అధిష్ఠానం చెప్పిందని ప్రచారం చేసుకోవడం గమనార్హం. తెలుగు దేశం- జనసేన అధిష్ఠానాలు స్పష్టత ఇవ్వవలసి ఉంది. నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు,మరో సీనియర్ నేత కుందుల సత్యనారాయణ సీటు కోసం పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. కొవ్వూరులో మాజీ మంత్రి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు కెఎస్ జవహర్ అభ్యర్థిత్వాన్ని అక్కడ ఓ ప్రధాన వర్గం వ్యతిరేకిస్తుంది. ఇటీవల ఆత్మీయ సమావేశం పేరిట, జవహర్ వ్యతిరేకవర్గం సమావేశమైన సంగతి తెలిసిందే. జవహర్ తప్ప ఇంకెవరికి ఇచ్చినా ఫర్వాలేదనేది వారి వాదన.అందులో గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడివెంకటేశ్వరరావును కూడా ప్రతిపాదిస్తున్నట్టు సమాచారం.కానీ అధిష్ఠానం కెఎస్ జవహర్‌ను అంత తేలికగా తీసి పడేయదనే వాదన కూడా ఉంది. జవహర్‌కు ప్రజల్లో పట్టు ఉన్నా, అక్కడ కీలక పెద్దలతో విబేధాలే ఆయనకు సమస్యగా మారాయి.ఇక్కడ జనసేన నుంచి మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు టికెట్ ఆశిస్తు న్నారు. టీడీపీలో గిల్లికజ్జాల మధ్య తనకే అవకాశం వస్తుందనే ఆశతో ఆయన ఉన్నారు.

వైసీపీలో ఎవరి దారి వారిదే..

వైసీపీలో గందరగోళం పోలేదు. కొన్ని సీట్లు ఖరారైనా వారిలో పెద్దగా ఉత్సాహం కనిపించడంలేదు. ఇంత వరకూ నలుగురు అభ్యర్థులను వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది.కానీ నలుగురిని ఓ స్థానం నుంచి మరో స్థానా నికి బదిలీ చేసింది. దీంతో వారికి అక్కడ అనేక సమ స్యలు ఎదురవుతున్నాయి.జిల్లా మంత్రి తానేటి వనితను కొవ్వూరు నుంచి గోపాలపురం పంపించారు. అక్కడి ఎమ్మెల్యే తలారి వెంకట్రావును కొవ్వూరు పంపించారు. గోపాలపురంలో ఇప్పటి వరకూ ఎమ్మెల్యే కూడా ఉన్న వర్గానికి మంత్రి వనిత ప్రాధాన్యత ఇవ్వరని, ఆమె ఇతరులకు ప్రాధాన్యత ఇస్తుందనే వాదన పెరిగింది. అదే పరిస్థితి కొవ్వూరులో కూడా ఉంది. కొవ్వూరులో ఆమె అక్కడి పెద్దలను కాదని ఓ ప్రత్యేక వర్గాన్ని పెంచి పోషించినట్టు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే.ఇవాళ తలారి వెంకట్రావు ఆమెను వ్యతిరేకించిన వర్గంతో ముందుకు వెళుతున్నారు. దీంతో కొవ్వూరులోని ఆమె వర్గంగా చలామణీ అయిన నేతలంతా దిక్కులు చూస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి పదవిలో ఉన్న చెల్లుబోయిన వేణును రాజమహేంద్రవరం రూరల్‌కు పంపించడంతో కొందరు అసంతృప్తితో ఉన్నారు. స్థానిక బీసీ నేతలకు ఎవరికైనా చోటు కల్పిస్తే బావుండేదనే వాదన ఉంది. అక్కడ ఇంత వరకూ కోఆర్డినేటర్‌గా ఉన్న చందన నాగేశ్వర్ ఎటూకాకుండా పోయారు. ఆయన తండ్రి చందన రమేష్ గతంలో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన సంగతి తెలిసిందే. మంత్రికి ఇక్కడ సీటివ్వడంతో చందన బయట తిరగడం మానేశారు. ఎంపీ మార్గాని భరత్‌కు కూడా తలపోట్లు తప్పడంలేదు. ఎంపీ స్థానం నుంచి ఆయనను సిటీ ఇన్‌చార్జిగా నియమించిన సంగతి తెలిసిందే.కానీ సిటీలో ఆయనకు వైసీపీలో ముఖ్య నేతలు చాలా మంది వ్యతిరేకులే. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు.ఆయన ఆధ్వర్యంలో ఇటీవల ఆర్యవైశ్యుల సమావేశం జరిగింది. వైశ్యులకు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన శ్రేయోభిలాషులు, అనుచరులు మాత్రం వేరే పార్టీలోకి వెళ్లాలని ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిళారెడ్డికి ఎంపీ భరత్ మధ్య కూడా గ్యాప్ ఉంది.ఇది ఏ పరిస్థితులకు దారితీస్తుందో మరి.ఇక జిల్లాలో ఇంకా ముగ్గురు ఎమ్మెల్యేలను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.రాజానగరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా టికెట్ తనకేనని చెబుతూ, పార్టీ ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఆయన సోదరుడు గణేశ్ తనకూ ప్రాధాన్యత కావాలని పట్టుపడుతున్నట్టు సమాచారం.అనపర్తి ఎమ్మెల్యే డా. సూర్యనారాయణరెడ్డి పేరు కూడా అధికారికంగా ఖరారు కావలసి ఉంది.ఆయన సతీమణి కూడా రాజకీయాలు కీలకంగా ఉంటుండడంతో జగన్ ఏవిధంగా ఇక్కడ నిర్ణయం తీసుకుంటారోననే మీమాంస ఉంది. ఇటీవల ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి తన కుటుంబ పెద్దలు, సభ్యు లతో అంతర్గత సమావేశం పెట్టి,రాష్ట్రంలో టీడీపీ- జనసేనే అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, ఇక్కడ మాత్రం మనమే గెలుస్తామనే అభిప్రాయానికి వచ్చి, ఎన్నికల తర్వాత ఏ నిర్ణయం తీసుకుంటే బావుంటుందనే కోణంలో చర్చ జరిగినట్టు విస్తృతంగా ప్రచారం జరిగింది.నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు విషయంలో కూడా అధికారికంగా ప్రకటించవలసి ఉంది.

టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎవరో?

జిల్లాలో ఇపుడు టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎవరనే చర్చ జరుగుతోంది. వైసీపీ ఇప్పటికే డా. గూడూరి శ్రీనివాసరావును రాజమహేంద్రవరం లోక్‌సభ ఇన్‌చార్జిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. టీడీపీ అభ్యర్థి కూడా త్వరలో ఖరారు కానున్నారు.టీడీపీ- జనసేన శాసన సభ అభ్యర్థుల ప్రకటన తర్వాతే ఎంపీ అభ్యర్థిని ప్రకటిస్తారనే ప్రచారం ఉంది. మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్, బొడ్డు వెంకటరమణ, గన్ని కృష్ణ, శిష్టాలోహిత్ వంటి పేర్లు పరిశీలనలో ఉన్నట్టు చెప్పారు.ఇక బీజేపీ, వామపక్షాలు కూడా ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి.



పుష్కరప్లాజా వద్ద పైకిలేచిన టైల్స్‌ను పరిశీలిస్తున్న ఆదిరెడ్డి వాసు

నాణ్యత లేకుండా పనులు

కమీషన్లకు ఎంపీ అనుచరుల కక్కుర్తి : ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్ రామ్ అనుచరుల కమీషన్ల కక్కుర్తి వల్ల అభివృద్ధి పనుల్లో డొల్లతనం కనిపిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు. రాజమహేంద్రవరం పుష్కరప్లాజాను ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ పైకి లేచి ప్రమాదకరంగా ఉన్న టైల్స్‌ను చేశారు. పుష్కరప్లాజా ఏర్పాటులో నాణ్యత ప్రమాణాలు లోపించాయని ఆరోపించారు. ప్రజాధనంతో చేపట్టిన చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి పనులు నాణ్యతగా ఉండడం వల్ల నేటికీ చెక్కుచెదరలేన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి ఎంపీ అనుచరులు నాణ్యత లోపాలతో పనులు చేసినా భరత్ రామ్ ఒత్తిడి వల్ల వారిపై కమిషనర్ ఎటువంటి చర్యలు తీసుకోలేన్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, టీడీపీ కోశాధికారి శెట్టి జగదీష్, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు తవ్వా రాజా, నాయకులు మాటూరి సిద్దు, ఎంఎస్.రావు, నల్లం ఆనంద్, గ్రంధి రాజా,కొత్త రాజేష్, సిహెచ్ శివ, పింకేష్, నారాయణ పాల్గొన్నారు.



చాగల్లులో స్థల పరిశీలన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

9న కొవ్వూరులో షర్మిల రచ్చబండ

చాగల్లు, ఫిబ్రవరి 4 పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 9వ తేదీన కొవ్వూరు నియోజవర్గంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తారని కాంగ్రెస్ పార్టీ ఉభయగోదావరి జిల్లాల పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలో స్థల పరిశీలన చేస్తున్నట్టు చెప్పారు. ఆదివారం చాగల్లు విచ్చేసి పర్యటనకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా స్థలం ఎంపిక చేస్తామని కాంగ్రెస్ పార్టీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నం మురళీ కృష్ణ, కే.శ్రీనివాస్, పాలకుర్తి ప్రభాకర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటు వాగ్దానం ఏమైంది?

ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గ్రీష్మకుమార్



కార్యక్రమంలో పాల్గొన్న వెల్డింగ్ అండ్ ఐరన్ డిజైనింగ్ వర్కర్స్

నిడదవోలు, ఫిబ్రవరి 4: నిడదవోలులో ఆటోనగర్ ఏర్పాటుకు వాగ్దానం చేసిన వైసీపీ ప్రభుత్వం ఎప్పుడు నెరవేరుస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. ఆదివారం నిడదవోలులో ఆదివారం జరిగిన వెల్డింగ్ అండ్ ఐరన్ డిజైనింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆటో నగర్ కోసం మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసిందని, తదుపరి వైసీపీ ప్రభుత్వం ఆటోనగర్ నిర్మిస్తామని వాగ్దానం చేసి నిలబెట్టుకోలేక పోయిందన్నారు. నాలుగున్నరేళ్లుగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు తీపర్తి వీర్రాజు, బండారు వెంకటస్వామి, భైపే ప్రసాద్, పట్టపు ఎడుకొండలు, రామకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు కుటుంబానికి పరామర్శ



పెరవలి, ఫిబ్రవరి 4: ఖండవల్లిలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు వెంకటేశ్వర్లు కుటుంబాన్ని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, ఎం.సుందరబాబు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ పోషణకు ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తే వడ్డీల భారంతో నష్టాలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఆడ్వాణీకి భారతరత్న ప్రకటించడంపై హర్షం

గోపాలపురం, ఫిబ్రవరి 4: రామ జన్మభూమి పోరాట రథసారధి ఎల్‌కే ఆడ్వాణీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద మండలాధ్యక్షుడు గెల్లాని శ్రీనుబాబు ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో వీరరాఘవులు, శ్రీనివాసరావు, కొండేపాటి రత్నాజీచౌదరి, పాలడుగుల వెంకట్, నారాయణ, దేవులపల్లి నరేంద్ర, ఉండవల్లి మార్కండేయచౌదరి పాల్గొన్నారు.

'హామీలను జీవోలుగా విడుదల చేయాలి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న జువ్వల రాంబాబు

పెరవలి, ఫిబ్రవరి 4: అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవోలుగా విడుదల చేయాలని అంగన్‌వాడీ పెరవలి ప్రాజెక్టు గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరవలిలో ఆదివారం జరిగిన అంగన్‌వాడీల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు ఐకమత్యంగా భవిష్యత్తులో కూడా పోరాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుందరపాల్, రంగనాయకి, లక్ష్మీమాధవి, విజయనిర్మల, పార్వతి, ధనలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

తహశీల్దార్ రాజరాజేశ్వరికి ఘన వీడ్కోలు

పెరవలి, ఫిబ్రవరి 4: పెరవలి తహశీల్దార్‌గా పని చేసి బదిలీ అయిన రాజరాజేశ్వరికి ఆదివారం తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రాజరాజేశ్వరితో పాటు ఆమె భర్త ఉండ్రాజవరం తహశీల్దార్ గొట్టుముక్కల కనకరాజును కూడా సత్కరించారు.

టీడీపీలో చేరిన వైసీపీ దళిత నాయకులు



టీడీపీలో చేరిన దళిత నాయకలు, కార్యకర్తలతో బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 4: జగన్ ప్రభుత్వం ఎస్సీఎస్టీ నిధులను దారి మళ్లించి దళితులకు తీరని అన్యాయం చేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఆదివారం మండలంలోని వేలివెన్నులో పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన వైసీపీ దళిత నాయకులు, కార్యకర్తలు 25 మంది శేషారావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాకరపర్రు టీడీపీ నాయకులు సంగీత జయరాజు, పెనుమత్స మధు, అబ్బిన సీతారామ్, గూడాల మురళీకృష్ణ, సిర్రా అంజి తదితరులు పాల్గొన్నారు.

8న చలో విజయవాడ

- ఏపీ మధ్యాహ్న భోజన పథకం కమిటీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు

గోపాలపురం, ఫిబ్రవరి 4: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ఛార్జీలు పెంచాలని ఈ నెల 8న చలో విజయవాడకు పిలుపునిచ్చినట్టు ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథక కమిటీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బుచ్చిబాబు ఆదివారం తెలిపారు. ఈ మేరకు చలో విజయవాడ కరపత్రాలను మధ్యాహ్న భోజన పథక కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా బుజ్జిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న మెనూ చార్జీలకు వాస్తవ ఖర్చులకు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. కార్మికులకు పని భారం పెంచడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచకపోవడంతో తమ పరిస్థితి అప్పు చేసి పప్పుకూడు అన్న చందంగా మారిందన్నారు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి కార్మికులను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న విజయవాడలోని డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులంతా తరలిరావా లన్నారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, బీర పాప, వెంకయమ్మ, లక్ష్మీకాంతం, సుశీల, పుష్ప, గుడిసే రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి దామోదర మహారాజు విరహోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న గౌడీయ మఠం స్వామీజీ వామన మహరాజు

కొవ్వూరు, ఫిబ్రవరి 4: త్రిదండి స్వామీజీ మద్భక్తి సుధీర దామోదర మహరాజు ద్వితీయ వార్షిక విరహ మహోత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు గౌడీయామఠం స్వామీజీ శ్రీమద్భక్తి విబుధ వామన మహరాజు తెలిపారు. ఆదివారం గౌడీయామఠంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 7 నుంచి 13వ తేదీ వరకు భాగవత సప్తాహాలు, 7న 108 కలశాలతో నగర సంకీర్తన, 14న ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, విశేష పూజలు, నైవేద్యాలు, భోగహారతులు జరుగుతాయన్నారు. సమావేశంలో శ్రీపాద భక్తిప్రమోద జనార్ధన మహరాజు, శ్రీపాద రమణ కృష్ణదాస్ పాల్గొన్నారు.

దోసాలమ్మ జాతరకు శ్రీకారం

బిక్కవోలు, ఫిబ్రవరి 4: కొమరిపాలెం గ్రామ దేవత దోసాలమ్మ జాతర ఉత్సవాలకు ఆదివారం కేపీఆర్ సంస్థల చైర్మన్ కొవ్వూరి పాపారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన పందిరి రాట వేసి ఉత్సవ పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈనెల 10 అమ్మవారి జాతర, సంబరం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, కొవ్వూరి చినబుజ్జి, తాడి అరవిందం, పారిశ్రామికవేత్తలు చింతా పాండురంగారెడ్డి, వెంకటరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొవ్వూరి సురేష్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగిస్తున్న వైసీపీ

- తక్కువ పోస్టులతో ఉద్యోగ ప్రకటనలెందుకు?
- అభ్యర్థుల వయో పరిమితి పెంచాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు



పోటీ పరీక్షల పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఐవీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4: వైసీపీ ప్రభుత్వం తన పదవీకాలం చివరిలో అతితక్కువ పోస్టులతో ఉద్యోగ ప్రకటనలు చేయడం నిరుద్యోగులను మోసం చేయడమే అని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు(ఐవీ) అన్నారు. ప్రభుత్వం ఐదేళ్లకాలంలో డీఎస్సీ, గ్రూప్స్ తదితర ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులకు నిరాశ మిగిల్చిందని విమర్శించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో గ్రూప్స్, డీవైఈవో ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, వీరేశలింగం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఐవీ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఏటా జనవరిలో జాబ్ కేలండర్ ఇస్తామని, ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను వంచించిందన్నారు. అభ్యర్థుల వయోపరిమితి పెంచడానికి చర్యలు తీసుకోవాలని, గ్రూప్స్, డీఎస్సీలో మరిన్ని పోస్టులు పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పోటీ పరీక్షలపై అభ్యర్థులకు అవగాహన కల్పిస్తూ పోటీ పరీక్షలకు, అకడమిక్ పరీక్షలకు మధ్య తేడాను గమనించాలని సూచించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు రచించిన భారత సమాజం అనే పుస్తకాన్ని ఎమ్మెల్సీ ఐవీ, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అనే పుస్తకాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి ఆవిష్కరించారు. సదస్సులో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, నాయకులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే లక్ష్యం

- ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తలారి
- కొవ్వూరులో రెండు గంటలు ఆలస్యంగా సభ



కొవ్వూరులో చెక్కును పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు/చాగల్లు, ఫిబ్రవరి 4: మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కొవ్వూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. కొవ్వూరు పట్టణ, మండలం, చాగల్లు మండలానికి సంబంధించి 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సభకు డ్వాక్రా సంఘాల సభ్యులు పూర్తిస్థాయిలో హాజరుకాక పోవడంతో సభ రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభించారు. ఎమెల్యే తలారి మాట్లాడుతూ కొవ్వూరు పట్టణంలో 549 గ్రూపులకు రూ.4,35,11,144, మండలంలో 1324 గ్రూపులకు రూ.10,10,27871 మహిళల ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ గండ్రోతు అంజలి, వైస్ ఎంపీపీ నూతంగి రేఖ, కంటమణి రమేష్‌బాబు, రుత్తల భాస్కరరావు, కమిషనర్ బి.శ్రీకాంత్, ఎంపీడీవో కె.సుశీల పాల్గొనగా చాగల్లులో ఎంపీపీ మట్టా వీరస్వామి, గండ్రోతు సురేంద్రకుమార్, గారపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యనమలను కలిసిన టీడీపీ నాయకులు



యనమల రామకృష్ణుడిని కలిసిన టీడీపీ నాయకులు

నల్లజర్ల, ఫిబ్రవరి 4: మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును పార్టీ గోపాలపురం నాయకులు ఆదివారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలోని పరిస్థితులు, పార్టీలో జరుగుతున్న పరిణామాలు, రాబోయే ఎన్నికల్లో ఎదుర్కోవలసిన అంశాలను ఆయనకు వివరించినట్టు చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకట రమణ చెప్పారు. ఆయన వెంట గంటా బాబ్జీ, వల్లూరి సత్తిపండు, బులుసు ధామోధర్, సవలం రామకృష్ణ ఉన్నారు.

ప్రమాద బాధితుడికి జనసేన సాయం



నాగేంద్రకు వీల్‌చైర్, ఆర్థికసాయం అందజేస్తున్న సువర్ణరాజు

గోపాలపురం, ఫిబ్రవరి 4: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే జనసేన సిద్ధాం తమని పార్టీ నియోజ కవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. ఆదివారం మండలంలోని భీమోలు పంచాయతీ పరిధిలోని తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన చవలపాటి నాగేంద్ర కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న సువర్ణరాజు స్పందించి వీల్‌చైర్‌తో పాటు ఆర్థిక సాయాన్ని కార్యకర్తలతో కలిసి అందించారు. కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు పోసిన గణపతి, సూర్య భగవాన్, ఉమామహేశ్వరరావు, కృష్ణ, దేవీవరప్రసాద్, ఫణీంద్ర, బాలు, రాజు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

కోనసీమ జిల్లా వ్యక్తి అరెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైలులో చట్ట విరుద్ధంగా తీసుకొస్తున్న తెలంగాణ మద్యం సీసాలను ప్రభుత్వ రైల్వే పోలీసులు(జీఆర్పీ) స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. సీఐ విజయ్‌శంకర్ వివరాల ప్రకారం.. ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో భాగంగా జీఆర్పీ డీఎస్పీ ఎల్.మోహన్‌రావు పర్యవేక్షణలో రైల్వే స్టేషన్‌లో ఆదివారం ఆర్పీఎస్ఐ కె.మావుళ్లు తమ సిబ్బందితో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మద్యం, బంగారం, నగదు అక్రమ రవాణాపై దృష్టి సారించారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి రైలులో రాజమహేంద్రవరం వచ్చిన రావులపాలెం మండలం వెదిరేశ్వరానికి చెందిన వాసంశెట్టి ధనరాజ్ లగేజీ బ్యాగ్‌ని తనిఖీ చేశారు. తెలంగాణ నుంచి తీసుకొస్తున్న 6 మద్యం ఫుల్ బాటిళ్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని ధనరాజ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఆడ్వాణీకి భారతరత్న దేశానికే గర్వకారణం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4: దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ఎల్‌కే ఆడ్వాణీకి భారతరత్న ప్రకటించడం దేశానికే గర్వకారణమని ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బలభద్ర వీరవెంకట సత్యనారాయణ ఆదివారం అన్నారు. అసలు సిసలైన హిందూ దేశ నాయకుడు అద్వాణి అని, వారికి దేశ అత్యున్నత పురస్కారం ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.

టీడీపీ-జనసేన ప్రభుత్వ స్థాపనకు సహకరించాలి

జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర



గోకవరంలో ప్రచారం నిర్వహిస్తున్న సూర్యచంద్ర

గోకవరం, ఫిబ్రవరి 4: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వ స్థాపనకు ప్రతిఒక్కరూ సహకరించాలని జనసేన పార్టీ జగ్గంపేట నియోజక వర్గ ఇన్‌చార్జ్ పాటంశెట్టి సూర్యచంద్ర అభ్యర్థించారు. గోకవరంలో ఆదివారం ఆయన జనం కోసం జనసేన మహాయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతోపాటు, టీడీపీ-జనసేన ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలని కోరారు. జనసేన పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలతో కూడిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ఇసుక లారీలు పాత జీఎన్‌టీ రోడ్డుకు వెళ్లాలి

వాహన రాకపోకలను అడ్డుకున్న గౌరీపట్నం గ్రామస్థులు



గౌరీపట్నంలో ఇసుక లారీలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న కార్మికులు

దేవరపల్లి, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరం, కాతేరు నుంచి ఇసుక భారీలోడు లారీలు జాతీయ రహదారి పైనుంచి రాకుండా సర్వీసు రోడ్డు మీదుగా గౌరీపట్నం వచ్చి అక్కడి అండర్ పాస్ ద్వారా జీఎన్‌టీ రోడ్డుకు వందలాది వాహనాలు ప్రతిరోజూ వెళ్తున్నాయని, ఈ వాహనాలను కాపవరం నుంచి పాత జీఎన్‌టీ రోడ్డుకు వెళ్లాలని ఆదివారం ఉదయం వాహనాల రాకపోకలు అడ్డుకున్నారు. టీడీపీ నాయకుడు కోరారు ధ్రువకాంత్ మాట్లాడుతూ గౌరీపట్నం సర్వీసురోడ్డు గుండా భారీ వాహనాలు నిత్యం రాకపోకలు జరుపుతున్నాయని, ఈ రోడ్డు సమీపంలోనే ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రి, సచివాలయాలు ఉన్నాయని, ప్రజలు, విద్యార్థుల రాకపోకలు సాగిస్తుంటారని, ఈ వాహనాలు అతివేగంగా రావడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయన్నారు. ఈ వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వీసు రోడ్డు గుండా కాకుండా జాతీయ రహదారి పైనే వెళ్లాలన్నారు. మరలా లారీలు ఇటు వస్తే అడ్డుకుంటామని, వాహనాలు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుత్తికొండ శ్రీనివాసరావు, సూరిబాబు, పాతూరి గిరిధర్, గంటా బాలాజీ, స్థానికులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గోకవరం మాజీ ఎంపీపీ



నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ సూర్యనారాయణ

గోకవరం, ఫిబ్రవరి 4: గోకవరం మాజీ ఎంపీపీ డీవీవీ సూర్యనారాయణ (డబుల్ మీసాలు సూర్యనారాయణ) ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. డీవీవీ తన స్వగృహంలో జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఆయనతో పాటు ఆయన కుమారుడు సీతారామకృష్ణ కూడా టీడీపీలో చేరారు. గతంలో సూర్యనారాయణ తంటికొండ మంగాదేవి ఆలయ ట్రస్ట్ ఛైర్మన్‌గా, సర్పంచ్ గాను సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కాంగ్రెస్ వాదినని, అయితే మాజీ ఎమ్మెల్యే నెహ్రూపై ఉన్న అభిమానంతో టీడీపీలో చేరుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బదిరెడ్డి అచ్చన్నదొర, మలిరెడ్డి సిరి, పెద్దాడ వెంకన్నదొర, గెడ్డం బాబు పాల్గొన్నారు.

మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న బాడీబిల్డర్లు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు వద్ద నున్న శ్రీ గౌతమీ వ్యాయామ కళాశాల ఆవరణలో 15వ మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలు ఆదివారం రాత్రి నిర్వహించారు. జాంపేట కోపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ బొమ్మన జయకుమార్ ఈ పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె మధు, బిగ్ వింగ్ ఎండీ బులి వెంకటరావు, ప్రవీణ్‌నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిస్టర్ ఇండియా రామాంజనేయులును సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది బాడీ బిల్డర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో విజేతలైన వారు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో కేరళ రాష్ట్రంలోని కాలికట్‌లో నిర్వహించే సౌత్ ఇండియా బాడీబిల్డింగ్ పోటీలకు, మార్చి 15, 16, 17 తేదీల్లో తిరుచూర్‌లో జరిగే ఆలిండియా పోటీలకు ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులుగా వెళతారని పేర్కొన్నారు.

శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన

గోకవరం, ఫిబ్రవరి4: హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడుపై కత్తి పద్మారావు అనే వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు పిలుపు మేరకు ఆదివారం గోకవరంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామసేన సభ్యులు దేవిచౌక్ సెంటర్ నుంచి ప్రదర్శనగా బయలుదేరి ఆంజనేయస్వామి గుడి సెంటర్ వద్ద ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. శ్రీరామచంద్రుడిని వ్యక్తిగతంగా దూషించడం పద్మారావుకు తగదన్నారు. హిందూవుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించిన పద్మారావుపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేసారు. అనంతరం ఆందోళనకారులు అక్కడి నుంచి బయలుదేరి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పద్మారావును వెంటనే అరెస్ట్ చేయాలంటూ ఎస్సై నాగరాజుకు వినతిపత్రాన్ని అందజేసారు. ఈకార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి బాపన్నదొర, ఉంగరాల ఆదివిష్ణు, బాడితబోయిన అబ్బులు, నరాలశెట్టి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

జైళ్లలో బాలబాలికలు ఉండరాదు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చట్టంతో విభేదించిన బాలబాలికలు కారాగారాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండడానికి వీల్లేదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి స్పష్టం చేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన 'యువతను పునరుద్ధరించడం' కార్యక్రమంలో భాగంగా కేంద్ర కారాగారాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 18ఏళ్ల లోపు వారు న్యాయస్థానాల్లో వయసు రుజువు చేసుకోవడానికి అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. అలాంటివారు ఎవరైనా ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఖైదీలు జైలుకు వచ్చిన సందర్భంలోనే జైలు సిబ్బంది వయసు విషయంలో శ్రద్ధ చూపాలని, 18ఏళ్లు నిండలేదని అనుమానం వస్తే వెంటనే తమకు తెలియజేయాలన్నారు.

టీడీపీ రాజమహేంద్రవరం ఎంపీ సీటును బీసీలకు ఇవ్వాలి

జిల్లా బీసీ సంక్షేమ సంఘం నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4: రాజమహేంద్రవరం ఎంపీ సీటును టీడీపీ కూడా బీసీలకు కేటాయించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సానబోయిన రామారావు మాట్లాడారు. చట్టసభల్లోకి ఎక్కువ మంది బీసీలు వెళ్లాలని అప్పుడే బీసీల సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. వైసీపీ రాజమహేంద్రవరం ఎంపీ సీటును బీసీలకు కేటాయించిందని, అలాగే టీడీపీ కూడా బీసీలకు సీటు కేటాయిస్తే బాగుటుందన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు మేడిశెట్టి తాతబ్బాయి మాట్లాడుతూ బీసీలకు అత్యధికంగా సీట్లు కేటాయించే పార్టీకి తమ మద్దతు ఉంటుందన్నారు. బీసీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సంఘం కూడా కృషి చేస్తుందన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి గొర్రా తాతబ్బాయియాదవ్, ఉప్పిడి గంగాధర్, గుత్తుల సుబ్రహ్మణ్యం మాట్లాడారు. బీసీలకు ప్రధాన రాజకీయపార్టీలు వంద సీట్లు కేటాయించాలని కోరారు.

జనసేనకు డ్రైవర్స్ అసోసియేషన్ మద్దతు



అనుశ్రీకి మద్దతు తెలుపుతున్న డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 4: జనసేన పార్టీకి ఈస్‌వెస్ట్ డ్రైవర్స్ అసోసియేషన్ మద్దతు ఇచ్చింది. ఆదివారం రాజమహేంద్రవరంలో జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణను అసోసియేషన్ అధ్యక్షుడు గోగులపాటి ఆధ్వర్యంలో డ్రైవర్లు కలిశారు. తామంతా జనసేనకు మద్దత్తుగా నిలవాలని నిర్ణయించామని త్వరలో వందలాది మందితో పార్టీలో చేరుతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అనుశ్రీ మాట్లాడుతూ అన్ని వర్గాల రాబోయే రోజుల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వంలో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రాజానగరం కాంగ్రెస్ సీటు కేటాయించండి

డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు మాచరయ్య



కాంగ్రెస్ సీటు కోరుతూ దరఖాస్తు అందజేస్తున్న మాచరయ్య

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 4: రాజానగరం నియోజకవర్గం శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని కోరుతూ డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య ఆదివారం దరఖాస్తు సమర్పించారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా తెలిపారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంబంధితులకు తన దరఖాస్తును అందజేశానని చెప్పారు. తాను పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి సీటు కేటాయించాలని కోరానన్నారు. కార్యక్రమంలో తనతో పాటు కాంగ్రెస్ మండల కార్యదర్శి కోడి నాగేశ్వరరావు, నాయకులు మిరియాల బాబి, రావిపాటి శ్రీను, ఆలపాటి గోవిందు తదితరులు పాల్గొన్నారన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజీమాల్ వై.స్ర్కీన్ 1	గుంటూరుకారం
వై.స్ర్కీన్2	సైంధవ్
దేవిశ్రీ(గాయత్రి)	నా సామి రంగ
అనన్య	గుంటూరు కారం
నిడదవోలు	
వీ మ్యాక్స్	అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	సైంధవ్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్